lోపలి పేజీలలో...

- వరి సాగులో భూసార యాజమాన్య పద్ధతులు
- 2013 భూ సేకరణ చట్టం రైతులకిచ్చే లాభాలు
- మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజల ప్రశ్నలు
- రైతులకు గిట్టుబాటు కాని మద్దతు ధరలు
- పంట రుణాలు, బీమా అమలు తీరు
- జీవామృతం, అమృత జలం తయారీ

పాలెకరి

సుస్థిర వ్యవసాయ మాస పత్రిక

సంపుటి: 5 సంచిక: 2 హైదరాబాద్ జులై 2016 పేజీలు: 40 వెల: రూ. 20/-

వర్షపు నీటిని సంరక్షించుకునేందుకు పొలం చెరువును తవ్వుకోగలిగితే,
పొలం చుట్టూ నీటిని భూమిలోకి ఇంకించే గుంతలను ఏర్పాటు చేసుకోగలిగితే
కరువు కాలంలో పంటలను కాపాడుకోగలుగుతాం.
వర్షాలు ఆలస్యమైనపుడు కంది, పత్తి లాంటివి నారుగా పెంచుకోగలిగితే
ఖచ్చితంగా సమయం కలిసి వస్తుంది.
జీవామృతాన్ని సిద్ధం చేసుకోవడం, సస్యరక్షణకు వేప గింజలను సేకరించుకోవడం
రైతులు బాధ్యతగా చేపట్టగలిగితే విష రసాయనాల వినియోగాన్ని తగ్గించుకోవచ్చు.



చేర్యాల, గజ్వేల్ మండలాలలో 5 గ్రామాల రైతులతో సమావేశాలు



తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత అత్యధికంగా రైతు బలవన్మరణాలు జరిగిన మెదక్‌జిల్లా గజ్వేల్ మండలం, వరంగల్ జిల్లా చేర్యాల మండలాలలో వ్యవసాయ కుటుంబాల సంక్షోభాన్ని లోతుగా అర్థం చేసుకుని, సంక్షోభ పరిష్కారానికి కొంతైనా కృషిని స్థానికంగా కొనసాగించాలని సుస్థిర వ్యవసాయ కేంద్రం (సి.ఎస్.ఎ), రైతు స్వరాజ్య వేదిక తెలంగాణా రాష్ట్ర కమిటీ నిర్ణయించాయి. తీవ్ర ఇబ్బందులలో వున్న కుటుంబాలను గుర్తించడం, రైతు బలవన్మరణాల బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా వచ్చేలా చూడడం, ఆ కుటుంబాలకు అండగా నిలబడడం, పర్యావరణ పరంగా, పంటల పరంగా ఆయా మండలాలలో వున్న సమస్యలను గుర్తించి, ప్రత్యామ్నాయాలపై క్యాంపెయిన్ నిర్వహించడం, శిక్షణలు ఇవ్వడం, వివిధ ప్రభుత్వ పథకాలు ఆయా గ్రామాలకు సక్రమంగా, అర్హులకు అందుతున్నాయా? లేదా పరిశీలించడం, అందేలా ప్రయత్నించడం, స్థానిక విద్యావంతులను, ఉద్యోగులను, టీచర్లను, విద్యార్థులను, ప్రజా ప్రతినిధులను, ప్రజా సంఘాలను కూడా కలుపుకుని పని చేయడం ఈ కృషిలో భాగంగా వుండాలని నిర్ణయించాయి. గత 3 నెలల క్రితం ప్రారంభించిన ఈ కృషి, మొదటి దశలో ప్రతి మండలంలోనూ, రైతు బలవన్మరణాలు ఎక్కువ జరిగిన 5 గ్రామాలను ఎంచుకొని సాగించాలని భావించాయి. అలాంటి 5 గ్రామాలను ఎంపిక చేసుకున్నాయి.



ఇందులో భాగంగా ఆయా గ్రామాలలో గ్రామాల వారీగా రైతు కుటుంబాలతో సమావేశాలు జరిపి సమస్యలను అధ్యయనం చేశారు. జూన్ నెల ప్రారంభంలో 5 గ్రామాలలోనూ చురుకుగా వున్న ముఖ్యులతో, రైతులతో చేర్యాల, గజ్వేల్ మండల కేంద్రాలలో సమావేశాలు జరిగాయి. వచ్చిన వారందరూ ఉత్సాహంగా ఈ పనిని ముందుకు తీసుకువెళతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కృషిని సమగ్ర పరిచేందుకు చేర్యాల మండలంలో ఒకరిని, గజ్వేల్ మండలంలో ఇద్దరిని వాలంటీర్లుగా ఎంపిక చేసుకున్నారు. లక్ష్యం స్పష్టంగా వుంది. మార్గం ఆటంకాలతో నిండి వున్నా, ముందుకు పోతామనే విశ్వాసం అందరిలోనూ వుంది.

- నవీన్, కొండల్, చందు, స్వామి, సూరన్న

తొలకరి

జులై 2016

సంపుటి : 5 సంచిక : 2

వెల 20/-

సంపాదకులు
డా॥ జి.వి.రామాంజనేయులు

సహ సంపాదకులు
కన్నెగంటి రవి
ఫోన్: 9912928422
ravi@csa-india.org

సంపాదక వర్గం
డా॥ టి.ఎ.వి.ఎస్. రఘునాథ్
జి. చంద్రశేఖర్
డా॥ జి. రాజశేఖర్

పబ్లిషర్ & ప్రింటర్
ఎం. లీలా ప్రసాద్

ముద్రణ
నవ్య ప్రింటర్స్, హైదరాబాద్.

వివరాలకు
ఎడిటర్, తొలకరి
12-13-445, వీధి నెం. 1,
తార్నాక, సికింద్రాబాద్ - 500 017
ఫోన్: 040-27014302 / 7735
www.tolakari.com

లోపలి పేజీల్లో

'మట్టి అద్భుత పదార్థం
ఆకుపచ్చని లోకాన్ని తనలో నుంచి
ఆవిష్కరించింది మట్టి'
'బతుకును బతికించే
నిలబెట్టే కదిలించే
కీలక మూలకం మట్టే'

'ప్రపంచమంతా మట్టిమీదే
కాదంటే మట్టి మనిషిమీదే నిలబడేది'
'మట్టిని నమ్ముకున్న బతుకు
మట్టిలోనే పాలి అయినప్పుడు
అది తప్పకుండా హత్యే
చేసిందెవరనే నేను ప్రశ్నిస్తాను'

రైతులకు భరోసాయివ్వని తొలకరి జల్లులు, ప్రభుత్వాల విధానాలు

ప్రభుత్వాలు ప్రకటిస్తున్న ఖరీఫ్ 2016 వీక్లీ రిపోర్టుల ప్రకారం "రెండు తెలుగు రాష్ట్రాలలోనూ, ఒకటి, రెండు జిల్లాలలో తప్ప సాధారణ వర్షపాతం నమోదైంది. కొన్ని జిల్లాలలో అధిక వర్షపాతం కూడా పడింది. రైతులు చురుకుగా వ్యవసాయ పనులు కొనసాగిస్తున్నారు." కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా వుంది. చాలా చోట్ల ఇంకా వ్యవసాయ పనులు ప్రారంభానికి అవసరమైన మంచి వర్షాలే పడలేదు. రైతులు విత్తనాలు కొనుక్కొని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఏం పంటలు వేయాలో తేల్చుకోలేని గందరగోళ స్థితిలో వున్నారు. ముఖ్యంగా తెలంగాణా రాష్ట్రానికి సంబంధించి ఈ స్థితి అన్ని చోట్లా కనిపిస్తున్నది. జూన్ నెలలో కురిసిన కొద్దిపాటి వర్షాలకు వేసిన విత్తనాలు మొలవక నష్టపోయిన స్థితి కూడా వుంది.

తెలంగాణా రాష్ట్రంలో ఈ సంవత్సరం రుణమాఫీ విడుదల మొత్తంపై జూన్ 25న మాత్రమే రాష్ట్ర ఆర్థిక శాఖ ఆమోదముద్ర వేసింది. వ్యవసాయ శాఖ నుండి ఆదేశాలు వెలువడి క్షేత్ర స్థాయిలో బ్యాంకులు రైతులకు పంట రుణాలు ఇవ్వడానికి మరికొంత కాలం పడుతుంది. రుణ మాఫీ మొత్తంలో కూడా సగం మాత్రమే ఇప్పుడు విడుదల చేస్తున్నారు. ఆ కొద్ది మొత్తమూ వడ్డీల చెల్లింపుకు సరిపోతుంది. రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటరుణం అందే అవకాశమే కనిపించడం లేదు. కౌలు రైతులకు సంబంధించి చట్టం నిర్దేశించిన మే 15 లోపు ఒక్క గుర్తింపు కార్డు కూడా ఇవ్వలేదు.

పంటల బీమాకు సంబంధించి ప్రీమియం చెల్లింపు గడువులు జులై 30తో అయిపోతున్నాయి. జూన్ 14కే పత్తి ప్రీమియం చెల్లింపు గడువు ముగిసిపోయింది. ఆనాటికి కేవలం 5-6 వేల మంది మాత్రమే తాము ఇచ్చే రుణంలో ప్రీమియం మినహాయించుకోమని బ్యాంకులకు లెటర్లు ఇచ్చారు. అంటే 99 శాతం మంది బీమా పరిధిలోకి రారన్నమాట. ఇది కేవలం కంపెనీలకు ప్రయోజనం చేకూర్చేదే తప్ప రైతులకు కాదు.

2016 ఖరీఫ్ కోసం ప్రకటించిన కనీస మద్ధతు ధరలు కూడా ఏమాత్రం ఆశాజనకంగా లేవు. రైతులను సంక్షోభం నుండి బయటపడేసి వారికి ఆదాయ భద్రత కల్పించేందుకు అవి ఏ మాత్రమూ సరిపోవు. ప్రభుత్వాలు వ్యవసాయ బడ్జెట్లో ఎన్ని బడాయి కబుర్లు చెప్పినా, సన్న, చిన్న కారు రైతులకు ఉపయోగపడే పథకాలకు నిధులు విడుదల చేయడం లేదు. లేదా కేటాయించి, విడుదల చేసిన నిధులను కూడా వెనకకు తీసుకుంటున్నారు. సూక్ష్మ నీటి పథకాల కోసం వేలాది మంది రైతులు దరఖాస్తు చేసుకున్నా ఒక్కరికి కూడా నిధులు శాంక్షన్ చేయడం లేదు. రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు కూడా నిధులు లేవని జిల్లా కలెక్టర్లు చెబుతున్నారు.

ఈ సమయంలోనే ప్రభుత్వాలు పారిశ్రామిక వేత్తల కోసం, నగరాల కోసం వేలాది కోట్ల వరాలు కురిపిస్తున్నారు. భూములను కంపెనీలకు అప్పగించేందుకు దూకుడుగా ముందు కెళుతున్నారు.చట్టాలను తుంగలో తొక్కి జీ.వోలతో పరిపాలన సాగించాలని చూస్తున్నారు. మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజల పట్ల తెలంగాణా ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఇందుకో మచ్చుతనక.

ప్రతి పక్షపార్టీ ఎం.ఎల్.ఏ.లు, ఎం.పిలను, అధికార పక్షంలో నిస్సిగ్గుగా కలిపేసుకుంటున్న ప్రభుత్వాలు, ప్రజలకు గొంతు లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నాయి. ప్రజల గొంతుగా వున్న టీ జే.ఏ.సి ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం పై ప్రభుత్వాధినేతలు సాగించిన మాటల దాడి పాలకుల నిజస్వభావాన్ని అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది. ఈ దశలో గ్రామీణ ప్రజల కర్తవ్యమొక్కటే. నిస్సహాయులుగా మిగిలి పోకుండా సంఘటితమవ్వడం. హక్కుల రక్షణ కోసం, సాధన కోసం ఉద్యమించడం.

- కె. రవి...

తెలంగాణా రాష్ట్రంలో వర్షపాతం, పంటల స్థితిగతులు

జూన్ 22 నాటికి (మి.మీ.) (విస్తీర్ణం హెక్టార్లలో)

క్ర.సం	జిల్లా పేరు	ఖరీఫ్‌లో సాధారణ వర్షపాతం	జూన్ 22 నాటికి నమోదు (శాతం) మి.మీ.	ప్రధాన పంటలు	సాధారణ విస్తీర్ణం	నాట్లు పడినవి
1.	నిజామాబాద్	84.1	115.3 (-3)	వరి	9,86,383	9,863
2.	మెదక్	675.8	78.3 (-16)	జొన్న	61,763	9,755
3.	వరంగల్	799.1	87.6 (-14)	సజ్జ	3,420	608
4.	కరీంనగర్	794.6	65.2 (-44)	మొక్కజొన్న	4,90,515	99,884
5.	ఆదిలాబాద్	984.2	96.3 (-32)	కంది	2,60,036	76,645
6.	రంగారెడ్డి	587.7	104.2 (33)	పెసర	1,09,572	35,084
7.	హైదరాబాద్	562.1	53 (-28)	మినుము	31,795	11,185
8.	మహబూబ్‌నగర్	446.6	119.6 (129)	వేరుశనగ	17,408	2,231
9.	నల్గొండ	561.7	65.2 (-9)	ఆముదం	72,401	2,514
10.	ఖమ్మం	875	99.4 (8)	సోయాబీన్	2,01,748	59,052
				పత్తి	17,08,729	2,84,372
	మొత్తం	**713.6**	**89.8**(-5%)	అన్ని పంటలు కలిపి	**43,43,000**	**6,02,000**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వర్షపాతం, పంటల విస్తీర్ణం

జూన్ 21 నాటికి (మి.మీ.) (విస్తీర్ణం హెక్టార్లలో)

1.	శ్రీకాకుళం	705.7	65.3(-38)	వరి	16,03,472(-3)	24,563
2.	విజయనగరం	692.7	84.9(-15)	జొన్న	37,035(-3)	272
3.	విశాఖపట్నం	712.5	100.9(-2)	సజ్జ	37,572 (-3)	2,974
4.	తూర్పు గోదావరి	768.1	96.1(7)	మొక్కజొన్న	91,494	3,479
5.	పశ్చిమ గోదావరి	792	104.7(28)	రాగి	32,218	413
6.	కృష్ణా	685.1	171.4(144)	కంది	1,86,192	25,615
7.	గుంటూరు	525.8	121.3(-91)	పెసర	23,022	10,497
8.	ప్రకాశం	388.3	53(-17)	వేరుశనగ	9,29,522	86,941
9.	నెల్లూరు	331.4	35.3(-21)	నువ్వులు	24,967	19,738
10.	చిత్తూరు	439.4	858(33)	ఆముదం	79,716	2,375
11.	కడప	393.5	68.4(19)	పొద్దుతిరుగుడు	13,378	310
12.	అనంతపూర్	338.4	63.6(23)	పత్తి	640,774	17,744
13.	కర్నూల్	455.1	79.7(35)	మిరప	118,022	422
	మొత్తం	**556**	**87.2**(21)	మొత్తం	**40,96,000**	**27,500**

తొలకరిలో సుస్థిర వ్యవసాయ పద్ధతులు

జి. చంద్రశేఖర్, సుస్థిర వ్యవసాయ కేంద్రం

విత్తన శుద్ధి:

వ్యవసాయంలో ముఖ్యమైన నిర్ణయాలు నాటక ముందే తీసుకోబడతాయి. ఉదా: ఏ పంట, ఎక్కడ, ఎంత విస్తీర్ణంలో, ఏ విత్తనం, ఎంత ఎరువు వుంది, ఇంకా ఎంత ఎక్కడి నుండి తెచ్చుకోవాలి మొదలైనవి. భూమి తయారు చేసుకున్న తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తలలో ముఖ్యమైనది విత్తన శుద్ధి. విత్తనశుద్ధి చేసుకోవడం వలన భూమి నుండి లేదా విత్తనం నుండి సంక్రమించే రోగాలను కొంత వరకు నిరోధించవచ్చు.

కాయగూరల నారు పోసేటప్పుడు, ముఖ్యంగా నారు కుళ్ళు తెగులు ఒక సమస్యగా గమనిస్తుంటాం. ఇది ఫైటో ఫ్తైర అన్న శిలీంద్రం వల్ల కలుగుతుంది. ఇది సోకకుండా వుండటానికి, నారు పెంచబోయేచోట ఒక చదరపు మీటర్‌కు 100 గ్రాముల చొప్పున వేప పిండి వేసుకోవాలి. విత్తనాలను 10 గ్రాముల ట్రైకోడెర్మ విరిడి అనే శిలీంద్రపు పొడితో విత్తనశుద్ధి చేసి (కొద్దిగా బెల్లం నీటిలో వేసి, దానిలో విత్తనాలను పొర్లించి వాటికి ఈ ట్రైకోడెర్మ పౌడర్ ను చల్లి బాగా కలియపెట్టి నీడలో ఆరనివ్వాలి) నారు నాటుకోవాలి. కంపోస్ట్‌లో కూడా ట్రైకోడెర్మ పొడిని కలిపి తేమ ఉండేటట్లు నీరు పోసి దానిమీద ఒక తెల్లటి పోలిథీన్ షీట్‌తో కప్పి ఉంచితే ఒక 7-10 రోజులలో తెల్లటి శిలీంద్రం కంపోస్ట్‌పై ఆవరించుకున్నట్లు గమనించవచ్చు. ఈ కంపోస్ట్‌ను నర్సరీలోగానీ, చేలలోగానీ వేసుకోవచ్చు.

ప్రతి పంటలోనూ విత్తుకునే ముందు మొలక శాతం చూసుకోవడం అవసరం. అదెలా అంటే, విత్తనాల నుండి ఒక వందవిత్తనాలను తీసుకుని మట్టిలో వేసి వాటిలో ఎన్ని మొలకెత్తినాయో చూస్తే అంత మొలకశాతం ఆ విత్తనాలకు వుందన్న మాట. దీనిబట్టి విత్తన మోతాదు అంటే వాడటమో, ఎక్కువ చేసుకోవడమో నిర్ణయించవచ్చు. పదును పోకుండా విత్తనం నాటుకోవచ్చు.

కంది, మొక్క జొన్న, వేరుశనగ మొదలగు పంటలలో విత్తనాలను జీవన ఎరువులైన రైజోబియం, అజటోబాక్టర్ లేదా అజోస్పిరిల్లుం మరియు ట్రైకోడెర్మ విరిడి లేదా సుడోమోనాస్ ఫ్లోరెస్సెన్స్‌తో విత్తనశుద్ధి లేదా చివరి దుక్కిలో పెంట ఎరువుతో పాటు ఎకరానికి 2 కిలోలు చొప్పున చేనులో వేసుకుంటే నేల నుండి సంక్రమించే రోగాలను కొన్నిటిని అరికట్టవచ్చు.

విత్తన మోతాదు:

వానలు ఈ సారి మెరుగ్గా వుంటాయన్నా జూన్ నెలలో అనుకున్నన్ని వానలు కురవక నాట్లు పూర్తి కాలేదు. నారు పోసుకోవడం, భూమి సరిచేసుకోవడం వంటి పనులు మొదలయ్యాయి. ఐతే అదును తప్పకుండా పంట వేసుకోవాలంటే ఇంకో పద్ధతి నారు పెంచుకోవడం. ఇది ఈ మధ్య కంది మరియు ప్రత్తి వంటి పంటలలో మొదలైంది. కంది నారు పెంచి వర్షాలప్పుడు నాటుకుంటే, మొక్క కూడా ఏపుగా పెరిగి మంచి దిగుబడి ఇస్తోంది. పంట కాలాన్ని బట్టి ఎకరానికి సుమారు 3-5 కి.గ్రాముల విత్తనం పడుతుంది. రకాన్ని బట్టి మొక్కల సంఖ్య ఎకరానికి 40,000 నుండి 1,32,000 వరకు వుండాలి (దీర్ఘకాలిక, మధ్య కాలిక, తక్కువ కాలపు రకాలు) మరియు అంతర పంటగా వేసుకుంటే కూడా వేసుకునే నిష్పత్తి బట్టి విత్తన మోతాదు ఆధార పడి వుంటుంది. రకాన్ని బట్టి విత్తన బరువు మారుతుంది. 100 విత్తనాలు సుమారు 6 గ్రాముల నుండి 10 గ్రాముల వరకు వుంటుంది. అందువల్ల మొక్కల సంఖ్య బట్టి ఆ రకం విత్తన బరువుని బట్టి సుమారు ఎంత విత్తనం పడుతుందో లెక్క కట్టుకుని వేసుకోవాలి. (100 విత్తనాల బరువు పెద్దగా వున్న విత్తనాలకు లేదా 1,000 విత్తనాల బరువు చిన్నగా వున్న విత్తనాలకు)

విత్తన మోతాదు (గ్రాములు) = మొక్కల సంఖ్య ఎకరాకు / విత్తన సంఖ్య.

ఎకరానికి మొక్కల సంఖ్య విత్తే దూరం బట్టి లెక్క కట్టుకోవాలి. అంటే 30 సెం.మీ. 45 సెం.మీ దూరంలో వుంటే ఒకఒక చదరపు మీటర్‌కి ఉండే మొక్కలు

= (100×100)/(45×30) = 7.4 అంటే సుమారు 5 మొక్కలు ఒక చదరపు మీటర్ కి. 4,047 చదరపు మీటర్లకి = 5×4,047 = 20,235 మొక్కలు.

విత్తనాలు కొన్నప్పుడు దాని పై మొలక శాతం రాస్తారు. దాన్ని బట్టీ, 1,000 లేదా 100 విత్తనాల బరువు, విత్తే దూరాన్ని బట్టి ఎన్ని గ్రాముల లేదా కిలోల విత్తనం అవుసరమవుతుందో లెక్క కట్టి విత్తనాలు వేసుకోవాలి.

ఉదా: బెండ పంట పెట్టాలనుకుంటే విత్తే దూరం 60సెం.మీ. 45సెం. మీ. ఐతే ఒక చదరపు మీటర్‌కి ఉండే మొక్కల సంఖ్య = (100×100) / (60×45) = 3.7 అంటే సుమారు 4 మొక్కలు.

ఒక ఎకరానికి ఉండే మొక్కలు 3.7×4,047 = 14,973.9 అంటే సుమారు 14,974 మొక్కలు.

1,000 విత్తనాల బరువు 50 గ్రాములు

14,974 విత్తనాలు (50/1,000) 14,974 = 748.7 గ్రాములు (750 గ్రాములు)

ప్యాకెట్ మీద ఇవ్వబడిన మొలక శాతం 60

అంటే మనం తీసుకోవాల్సిన విత్తన మోతాదు = 750×100/60 = 1,250 గ్రాములు


నారు పోసుకోవడం:

వర్షాభావ పరిస్థితులు లేదా సరియైన వర్షం లేకపోయినప్పుడు, కంది, ప్రత్తి వంటి పంటలను నర్సరీ కవర్‌లలో పెంచి మంచి వర్షాలు పడిన తర్వాత చేలో నాటుకోవడం ఒక పద్ధతి. దీనివల్ల సమయం దాటి పోవడం జరుగదు. రెండు నెలల మొక్కలను కూడా చేలో నాటుకోవచ్చు. తక్కువ నీటి తో మొక్కలు పెంచడం సాధ్యమవుతుంది. మొక్కల సంరక్షణ కూడా సులభతరము అవుతుంది.

చీడ పీడలు:

తొలకరి వర్షాలకు వేసిన మినుము, పెసర పంటల్లో మొలకెత్తిన తర్వాత ఆకుల మీద రంధ్రాలు ఏర్పడటం గమనించడమైంది. వీటిని పొగాకు లద్దె పురుగు కుటుంబానికి చెందిన స్పోడోప్టేరఎగ్జిగ్వ అన్న పురుగు ఆశించింది. దీని నివారణకు నీం సోప్ 10 గ్రాములు లీటర్ నీటికి గాని లేదా 5 శాతం వేప కషాయం పిచికారీ చేసుకోవాలి. చేలో పంగల కర్రలను ఏర్పాటు చేసుకోవాలి.

నారు మడులలో లేట మొక్కలపై రసం పీల్చే పురుగులు ముఖ్యంగా తామర పురుగులు, పేనుబంక ఆశించవచ్చు. వాటి యాజమాన్యానికి 5 శాతం వావిలి కషాయం లేదా 10 గ్రాముల నీం సోప్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.



తెలంగాణా రాష్ట్రంలో
పంట రుణాలు, పంటల బీమా-అమలు తీరు

డా॥ జి. వి. రామాంజనేయులు, రవి కన్నెగంటి

పంట రుణాలనేవి వాస్తవ సాగుదారులు పంటలను పండించేందుకు ఇవ్వాల్సినవి. కానీ ఈ పంట రుణాలు వాస్తవ సాగుదారులకు కాకుండా భూముల యజమానులకు మాత్రమే వెళుతున్నాయి. ఒక్క ఎకరం సాగు భూమి లేని హైదరాబాద్ నగరానికి కూడా ప్రతి సంవత్సరం 400 కోట్ల రూపాయల పంట రుణాలు వెళుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మొత్తం వ్యవసాయ రుణాలు కూడా హైదరాబాద్ నగరానికే 4,000 కోట్లకు పైగా వెళుతున్నాయి (రాష్ట్రంలో అత్యధికం)

పత్తి విస్తీర్ణం పెరిగాక రాష్ట్రంలో కౌలు రైతుల సంఖ్య బాగా పెరుగుతున్నది. రాష్ట్రంలో కనీసం 10 లక్షల మంది కౌలు రైతులు వుంటారని ఒక అంచనా. మహిళా రైతుల సంఖ్యా ఎక్కువ గానే వున్నా వారి పేర్లపై భూములు లేకపోవడం వల్ల వారికి కూడా బ్యాంకులు పంట రుణాలు యివ్వడం లేదు. ప్రభుత్వ భూ పంపిణీ పథకాలలో భూములు పొందిన దళిత, వెనుక బడిన వర్గాల, మైనారిటీ రైతులకు బ్యాంక్ రుణాలు అందడం లేదు. ఆదివాసీ రైతులకు యిస్తున్న పంట రుణాలు కూడా తక్కువే. దేవాదాయ భూములను కౌలుకు చేస్తున్న రైతులకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు.

అధీకృత సాగుదారుల చట్టం 2011 వచ్చాక కూడా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు యిచ్చే ప్రక్రియ ముందుకు వెళ్ళడం లేదు. గుర్తింపు కార్డులు పొందిన రైతులకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. దీనివల్ల ఈ సాగుదారులు ప్రధానంగా ప్రైవేట్ అప్పులపై ఆధారపడుతున్నారు. వడ్డీ రేట్లూ ఎక్కువే. ఒకటి రెండు సంవత్సరాలలో ప్రైవేట్ రుణాలను తీర్చలేకపోతే అవి పేరుకు పోతున్నాయి. ఈ పరిస్థితి లోనే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. లక్షల్లో కౌలు రైతులు వుంటే.. కొన్ని వేలమందికి కూడా రుణ గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదు. రుణ గుర్తింపు కార్డులు ఇచ్చిన వాళ్ళల్లో కూడా అందరికీ ఋణం అందుతున్న పరిస్థితి లేదు. ఉదాహరణకి ఆదిలాబాద్ జిల్లాలో సుమారుగా 3-4 లక్షల మంది కౌలు రైతులు (వ్యవసాయం మీద ఆధార పడిన వారు దాదాపు 18 లక్షలు) వుంటారని అంచనా. గత సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలో కేవలం 3,753 గుర్తింపు కార్డులు ఇవ్వగా అందులో ఋణం అందినది మాత్రం 282 మందికే. మొత్తం కౌలు రైతులకి అందిన ఋణం 1 కోటీ 6 లక్షలు మాత్రమే.

బ్యాంకుల నుండి పంట రుణాలు పొందిన రైతుల ఋణం నుండే బ్యాంకులు పంటల బీమా ప్రీమియం కోత పెట్టుకుంటున్నాయి కనుక వారు మాత్రమే బీమా పరిధిలోకి వస్తున్నారు. పైగా గ్రామం యూనిట్‌గా పంటల బీమా అన్ని పంటలకూ లేకపోవడం వల్ల రైతులకు పెద్దగా వుపయోగపడడం లేదు. కొత్త కొత్త బీమా పథకాలు ప్రవేశ పెడుతున్నా, అవి ఇంకా పైలట్ దశ దాటడం లేదు. ఇప్పటికి పంటల బీమా పరిదిలోకి వచ్చే రైతులు 30 శాతం కన్నా తక్కువే. 2014 పంటల బీమాలో కొన్ని మార్పులు చేయటానికి ప్రభుత్వం సంకల్పించి చివరికి 2015-16 నుంచి అమలులోకి తెచ్చింది. ఈ మార్పులు రైతులకు వుపయోగపడక పోగా సమస్యను ఇంకా జటిలం చేసేలా వున్నాయి.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా పథకంలోకి ప్రైవేటు కంపెనీలకు ప్రవేశం కల్పించారు. తెలంగాణాలో అగ్రికల్చరల్ ఇన్సూరెన్సు కంపెనీ, బజాజ్ అలయన్స్ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీలతో ఈ ఇన్సురన్సు అందించటానికి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.

రైతులు కొంత మొత్తం చెల్లిస్తే (మొత్తం లోనులో ఆహార పంటలకు 2 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం) చెల్లిస్తే మిగిలిన రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వాలు భరిస్తాయి. జిల్లాల మధ్యలో ప్రీమియం విషయంలో వున్న తేడాల వలన కొన్ని జిల్లాలలో ఇది 20 శాతం వరకు వుండొచ్చు. ప్రీమియం కట్టటానికి జూలై 30 ఆఖరు తేదీ.

లోను తీసుకున్న రైతులే కాక ఇతర రైతులు, కౌలు రైతులు బీమా కట్టాలి అంటే భూమి పట్టా కాని, ప్రభుత్వం ఆమోదించిన ఏదేనీ ధృవీకరణ పత్రం కానీ వుండాధీ సంవత్సరం మే 15 నాటికి ఒక్క రైతుకు కూడా గుర్తింపు కార్డు ఇవ్వలేదు.

వాతావరణ బీమా కింద ఈ సారి పత్తి (తొమ్మిది జిల్లాలు), మిరప (ఖమ్మం, వరంగల్), ఆయిల్ పాం (ఖమ్మం) మరియు బత్తాయి (నల్గొండ) పంటలు ఎంచుకోబడ్డాయి. అయితే ప్రీమియం కట్టటానికి ఆఖరు తేదీ పత్తి పంటకు జూన్ 14, మిరపకు జూలై 9, ఆయిల్ పాంకు జూలై 14, బత్తాయి కి ఆగష్టు 9. అయితే ఇప్పటిదాకా మంచిగా వర్షాలు రాలేదు, పత్తి, మిరప లాంటి వార్షిక పంటలు ఇప్పటిదాకా ఇంకా నాట్లు పడలేదు, రుణాలు అందలేదు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. దీనితో చాలా తక్కువ మంది రైతులు మాత్రమే ఈ అవకాశం పొందే పరిస్థితి వుంది. జూలై ఆఖరు వరకు అన్ని పంటలకు ఈ గడువు పెంచాల్సిన అవసరం వుంది.

వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా అకాల వర్షాలు, వర్షాభావం, కరువులు,వడగండ్లు, భారీ వర్షాలు లాంటి ప్రకృతి వైపరీత్యాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కరువును ప్రకృతి వైపరీత్యంగా చూడక పోవడం వల్ల, తెలంగాణా రైతులకు ఏ మాత్రమూ సహాయం అందడం లేదు. పంటకు అవసరమైన సమయాలలో వర్షాల మధ్య విపరీతమైన గాప్ వుండడం, మొత్తంగా సీజన్‌లో సాధారణ వర్షపాతం నమోదవడం లాంటి కారణాల వల్ల, పంటలు కరువు, వర్షాభావం బారిన పడి నష్టపోయినా రైతులకు సహాయం అందడం లేదు. పైగా వాతావరణాన్ని సూచించే కేంద్రాలు మండలానికి ఒకటి మాత్రమే వున్నాయి. దీని వల్ల ప్రతి 5 గ్రామాల మధ్యలో కూడా వర్షపాతం వ్యత్యాసం వుంటున్న దశలో రైతులకు సరైన సహాయం అందడం లేదు.

పరిష్కారాలు :

1. వాస్తవ సాగుదారులకు మాత్రమే పంట రుణాలు ఇవ్వాలి.
2. ప్రతి పంటకూ నిర్ణయించిన పంట రుణ పరిమితి (స్కేల్ అఫ్ ఫైనాన్స్) ప్రకారం అన్ని పంటలకూ పంట రుణాలివ్వాలి. స్కేల్ అఫ్ ఫైనాన్స్‌కు చట్టబద్ధత కల్పించాలి.
3. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి. కార్డులు పొందిన రైతులందరికీ బ్యాంక్ రుణాలు ఖచ్చితంగా ఇచ్చేలా 2011 చట్టంలో సవరణలు చేయాలి. మహిళా రైతులకూ పంట రుణాలివ్వాలి.
4. రాష్ట్రంలో ఎంత విస్తీర్ణంలో ఏ పంటలు వేస్తున్నారో ప్రభుత్వం దగ్గర సమాచారం వుంటుంది కనుక ప్రభుత్వం ముందుగానే బ్యాంకుల రుణాలతో సంబంధం లేకుండా పంటల బీమా ప్రీమియంను బీమా కంపెనీకి చెల్లించాలి. సన్న, చిన్న, మధ్యతరగతి రైతులకు పూర్తిగా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి. మిగిలిన రైతులకు 50 శాతం ప్రీమియం ప్రభుత్వం చెల్లించాలి.
5. ప్రతి 5 గ్రామాల మధ్యలో ఒక వాతావరణ సూచీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ఎప్పటికప్పుడు వాతావరణంలో మార్పులను, వర్షపాతాన్ని నమోదు చేయాలి.
6. కరువు మాన్యువల్‌ను కరువు యాజమాన్య మాన్యువల్‌గా మార్పులు చేయాలి. కరువు మండలాలను నిర్ధారించే ప్రక్రియను పునర్ నిర్వచించాలి.
7. గ్రామం యూనిట్‌గా బీమా పథకాలను అన్ని పంటలకూ విస్తరించాలి.
8. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలను నష్ట పోయిన రైతులకు ఎకరానికి 10,000 రూపాయల నష్ట పరిహారం చెల్లించాలి.

మల్లన్న సాగర్ ప్రాజెక్టు భూ సేకరణ, పరిహారం, పునరావాసంకు సంబంధించి

తెలంగాణ ప్రభుత్వ వాదనలు - వాస్తవాలు, ప్రశ్నలు

మల్లన్న సాగర్ ప్రాజెక్టు భూ సేకరణ, పరిహారానికి సంబంధించి గౌరవ భారీ నీటిపారుదల శాఖా మంత్రి శ్రీ హరీశ్ రావు గారు 11.06.2016 నాడు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. అంతకు ముందు వివిధ సందర్భాలలో వివిధ పత్రికల ద్వారా వారి అభిప్రాయాలు చెప్పారు. పత్రికలలో కూడా ఉన్నతాధికారుల మనోగతం పేరు మీద వివిధ వార్తా కథనాలు, మేధావుల పేరు మీద వ్యాసాలు వచ్చాయి. తద్వారా పై అంశానికి సంబంధించి ప్రభుత్వ వాదనలను, ఆలోచనలను స్పష్టంగా తెలియపరిచారు. విపక్షాలపై, ఇతరులపై కొన్ని ఆరోపణలు చేశారు, వారి తీరును ఆక్షేపించారు. నిర్వాసిత ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని, వారి నోట్లో మట్టి కొడుతున్నారని, వారికి ద్రోహం చేస్తున్నారని చెప్పారు. శ్రీ హరీశ్ రావు గారు, ఇతరులు ప్రభుత్వం తరపున చెప్పిన అంశాలు, లేవనెత్తిన ప్రశ్నలకు బదులుగా **మల్లన్న సాగర్ భూ నిర్వాసితుల పోరాట కమిటీ** తరపున ఈ కింది విషయాలను, ప్రశ్నలను మంత్రి గారి ముందుంచుతున్నాం. వీటి ద్వారా ద్రోహం ఎవరు చేస్తున్నారో స్పష్టమవుతుంది. వారిని తమ అవగాహనను, ఆలోచనను, ఆచరణను సరిచేసుకోవలసిందిగా కోరుతున్నాం.

ప్రభుత్వం తరపున వాదనలు:

1. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం ఎకరాకు 1.50 లక్షల నుండి 1.80 లక్షల వరకు పరిహారం ఇస్తే సరిపోతుంది. ఇంటి స్థలానికి 20 వేలు, ఇంటికి మరో 50 వేలు లభిస్తుంది. అది కూడా ప్రభుత్వం ఇచ్చిన, చెప్పిన స్థలంలోనే నిర్మించుకోవాలి. ప్రభుత్వం జీ.వో. 123 ద్వారా ఎకరాకి రూ. 5.80 లక్షల పరిహారం, రూ.5.40 లక్షలు ఇంటి కోసం అందచేస్తుంది, భూముల పైన ఉన్న ఆస్తులకు వాటి విలువ ఆధారంగా పరిహారం అందుతుంది. నిర్వాసితులు ఎక్కడ కావాలంటే అక్కడ ఇల్లు నిర్మించుకోవచ్చు.
2. మల్లన్నసాగర్‌లో ముంపుకు గురౌతున్న భూములకు ఇచ్చే పరిహారం దేశం మరియు ప్రపంచంలోనే నెంబర్ వన్. ఇప్పటి వరకూ రాష్ట్రంలో 2-3 లక్షల రూపాయలకంటే ఎక్కువ పరిహారం ఎవ్వరూ చెల్లించలేదు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం 5-6 లక్షల పరిహారం చెల్లిస్తుంది.
3. ప్రభుత్వం పూర్తిగా నిర్వాసితుల పక్షాన నిలబడి వారికి అందాల్సిన పరిహారం సంపూర్ణంగా అందేలా చర్యలు తీసుకుంటున్నది. చట్ట ప్రకారం భూములు స్వాధీనం చేసుకునే అవకాశం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ ప్రజల శ్రేయస్సును దృష్టిలో వుంచుకుని వారిని న్యాయబద్ధంగా ఒప్పించే ప్రయత్నం చేస్తున్నది.
4. ప్రపంచంలో అన్ని ప్రాజెక్టులకు ఇస్తున్న మాదిరిగానే ఏటిగడ్డ కిష్టాపూర్ బాధితులకు కూడా నష్టపరిహారం అందుతున్నది.
5. అవసరమైతే పదిరూపాయల భారం ప్రభుత్వం పై అదనంగా పడ్డా ఫర్వాలేదు. కానీ రైతులు మాత్రం నష్టపోవద్దనేది ముఖ్యమంత్రి గారి ఆలోచన. దానికనుగుణంగానే మల్లన్నసాగర్ నిర్మాణంలో నష్టపోతున్న ఏటిగడ్డ కిష్టాపూర్ రైతులకు తెలంగాణ ప్రభుత్వం 2013 ల్యాండ్ అక్విజిషన్ యాక్ట్ పరిధికి మించి నష్టపరిహారం అందచేసేందుకు సిద్ధమయ్యింది.

మల్లన్నసాగర్ ప్రజల తరపున జవాబు, ప్రశ్నలు:

1 భారత ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టాన్ని గెజిట్ ప్రకటన ద్వారా ముద్రించింది కాబట్టి సరిపోయింది. లేకపోతే రాష్ట్ర ప్రభుత్వం మరియు వారి చేతిలో వున్న ప్రసారసాధనాల హోరుకు ప్రజలు వారు చెప్పింది నిజమనే నమ్మేవాళ్లు. ఇలా మభ్య పెట్టడానికే ప్రభుత్వం అధికారికంగా చట్టాన్ని కానీ, రాష్ట్ర నిబంధనలను కానీ తెలుగులోకి అనువాదం చేయలేదేమో? ప్రభుత్వ పెద్దలకు తెలుగు పైన, తెలుగు మాత్రమే చదవగలగిన ప్రజల పైన వున్న ప్రేమకు ఇది నిదర్శనమేమో? చట్టాన్ని, నిబంధనలను, జీ.వో.123ను తెలుగులోకి ఎందుకు అనువాదం చేయలేదో ప్రభుత్వం ప్రజలకు సూటిగా సమాధానం చెప్పాలి.

2 జీ.వో. 123 ద్వారా ప్రభుత్వం ఏమి ఇస్తామని చెబుతుందో ఆ అంశాలకు సంబంధించి మాత్రమే 2013 చట్టాన్ని పోల్చి, చట్టంలో వున్న మిగిలిన అత్యంత కీలకమైన అంశాల గురించి మాట్లాడటం లేదు. అవి అసలు ఉనికిలో లేనట్లే నటిస్తుంది. ఒక పక్క జీ.వో.123లో లేనిది ఉన్నట్టు, 2013 చట్టంలో వున్నది లేనట్టు చూపుతూ కనికట్టు చేస్తుంది.

3 ప్రభుత్వం చెబుతున్న ఎకరాకి 50 వేల నుండి 60 వేల మార్కెట్ విలువ పాతది. గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం మార్కెట్ విలువను సవరించలేదు. అంతకు ముందు సవరించినా చాలా ఏళ్ల నుండి ఆ భూముల విలువను వాస్తవ స్థితికి అనుగుణంగా పెంచలేదు.

4 అసలు ఎకరాకి మార్కెట్ విలువ 60 వేలే ఎందుకుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. వాస్తవంగా ప్రజలు భూములు అమ్మకాలు కొను గోళ్ళు ఆ ధరకే చేస్తున్నారా? ప్రజల లావాదేవీలు జరుపుతున్న ధర ఎకరాకు 8-12లక్షలు వుండటం వాస్తవం కాదా? ప్రభుత్వమే నిర్ణయించిన ధరను పెంచడం కూడా ప్రభుత్వం చేతుల్లోనే కదా వుంది? ఇప్పుడు ప్రజల నుండి స్వచ్ఛందంగా కొనుగోలు చేయటానికి ఎకరాకి 5-6 లక్షల రూపాయలు ధరగా నిర్ణయించినప్పుడు పాత ధరను మార్కెట్ విలువగా ఎలా పరిగణనలోకి తీసుకుంటారు?

5 మార్కెట్ విలువ సవరణల నిబంధనలు, 1998 ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మార్కెట్ విలువను సవరించాలి. అలాగే 2013 చట్టం సెక్షన్ 26 ప్రకారం భూ సేకరణ కోసం ప్రాథమిక ప్రకటన ఇచ్చే ముందే కలక్టరు తప్పని సరిగా అప్పటికి ఆ ప్రాంతంలో వున్న బహిరంగ మార్కెట్ రేటును పరిగణనలోకి తీసుకుని మార్కెట్ విలువను సవరించి తగిన విధంగా పెంచాలి. మార్కెట్ విలువను పెంచే సందర్భంలో తప్పని సరిగా ఆయా ప్రాంత ప్రజలనుండి అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి. మార్కెటు రేటు సవరించకుండా భూములను సేకరించడం చట్ట విరుద్ధం.

6 ప్రస్తుతమున్న చట్టాలు, నియమాల ప్రకారం ప్రభుత్వం తన బాధ్యతను సక్రమంగా నెరవేరిస్తే మీరు చెపుతున్నట్టు ఎకరాకి 50 నుండి 60 వేల రూపాయల విలువే ఎందుకుంటుంది? ఆ విషయం తెలిసి కూడా భూమి విలువను అత్యంత తక్కువ చేసి చూపడం ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికేనా? 2013 చట్టానికి, 123 జీ.వోకి మధ్య తేడాను అతి పెద్దగా చేసి చూపడానికేనా? ప్రజల పట్ల బాధ్యత గల ప్రభుత్వం ఇలా ఒక ఫక్తు వ్యాపార సంస్థలా ప్రవర్తించవచ్చా?

7 2015-16 సంవత్సరాలలో మెదక్ జిల్లాలోనే ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములను పరిశ్రమలకు, సంస్థలకు ఇచ్చినప్పుడు ప్రభుత్వం ప్రకటించిన రేటు తక్కువగా వున్నా ఆయా సంస్థల నుండి మార్కెట్ విలువ పేరు మీద ఎకరానికి 5 లక్షల నుండి 20 లక్షల వరకు వసూలు చేయడం వాస్తవం కాదా? మరి ప్రభుత్వ భూములు అమ్ముకునేటప్పుడు ప్రాతిపాదిక కాని ధర రైతుల భూములు తీసుకునే టప్పుడు ఎందుకు అవుతుంది?

8 ఇప్పటి వరకు పత్రికలలో వచ్చిన జీ.వో. 123 బహిరంగ ప్రకటనలు చూస్తే అందులో స్పష్టంగా భూమి యజమాని, భూమిని తీసుకుంటున్న సంస్థ మధ్య అంగీకారం కుదిరిన భూమి ధరే చెల్లిస్తారని, ఆ భూమి పై వున్న ఆస్తులు అనగా చెట్లు, బావి ఇతరములకు ఎటువంటి నష్టపరిహారం అదనంగా ఇవ్వబడదని పేర్కొన్నారు. మరి మల్లన్న సాగర్ నిర్వాసితులకేమో భూమి ధరకు అదనంగా ఆస్తులకు కూడ విలువ కట్టి ఇస్తామని చెబుతున్నారు. ఒకే జీ.వో. ద్వారా రెండు విధాలుగా ఎలా పరిహారం చెల్లిస్తారు? అన్ని ప్రాజెక్టులకు ఇస్తున్న మాదిరిగానే ఏటిగడ్డ కిష్టాపూర్ బాధితులకు కూడా నష్టపరిహారం అందుతుందని, వీరి కోసం ప్రత్యేక చట్టం ఏమీ అమలు చేయమని మీరే ఒక పక్క నొక్కి చెబుతుంటే మరో వైపు ఈ అదనపు చెల్లింపులు నిజమని ఎలా నమ్మమంటారు?

9 2013 చట్టం ద్వారా మార్కెట్ విలువని ఏ విధంగా

నిర్ధారించాలి, భూమికి పరిహారం ఎంత చెల్లించాలి అన్న విషయాలు 2013 చట్టంలో చాలా స్పష్టంగా వివరించడం జరిగింది. వాటిని పూర్తిగా ప్రజలకు వివరించకుండా మీకు అనుకూలంగా అన్వయించుకుని అబద్ధాలను ప్రచారం చేయడం ఒక బాధ్యత గల ప్రభుత్వం చేయవలసిన పనేనా ?

10 2013 చట్టం ప్రకారం చెల్లించాల్సిన మొత్తం పరిహారం సవరించిన మార్కెట్ విలువకు నాలుగు రెట్ల(రాష్ట్ర ప్రభుత్వం మూడు రెట్లకు కుదించింది) వరకు కోల్పోతున్న భూమికి నష్టపరిహారం, భూమిపై వున్న చెట్లు, ఇతర ఆస్తుల విలువకు రెండు రెట్ల పరిహారం భూసేకరణ ప్రకటన తేదీ నుండి మొత్తం పరిహారం పై 12 శాతం వడ్డీ.

11 మార్కెట్ విలువను నిర్ధారించేటప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన మరియు సవరించిన రిజిస్ట్రేషన్ ధర కానీ లేదా గత మూడు సంవత్సరాలలో ఆ ప్రాంతంలో జరిగిన మొత్తం భూమి అమ్మకాలు, కొనుగోళ్లలో ఎక్కువ ధర ఉన్న సగం లావాదేవీలు తీసుకుని వాటి నగటు విలువను కానీ ఏది ఎక్కువైతే అది పరిగణనలోకి తీసుకోవాలి. ఆ ధరపైన కూడా ప్రజలకు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు చెప్పే హక్కు వుంటుంది. కలక్టరు తుది మార్కెట్ విలువ నిర్ణయించేటప్పుడు అవి పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వం మరి పైన పేర్కొన్న విధంగా ఆ ప్రక్రియను పూర్తి చేసి, సరైన లెక్క కట్టి రైతులకు ఖచ్చితంగా ఎంత పరిహారం అందవచ్చో చెప్పిందా ?

12 ఈ ధర కనీసం మాత్రమే. ఇంతకన్నా చట్టం ప్రకారం ఎక్కువ ఇవ్వకూడదని ఎక్కడా లేదు. సెక్షన్ 28 లోని ఏడవ అంశం భూములు కోల్పోతున్న వారికి తగిన న్యాయం చేయడానికి అయా పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పరిహారం నిర్ణయించే వెసులుబాటును కలక్టరకు ఇచ్చింది.

13 చట్టం ప్రకారం ఎంత మేరకు ఎక్కువగా ప్రజలకు న్యాయం చేయగలుగుతామో చూడాల్సిన ప్రభుత్వం, ఎంత తక్కువగా పరిహారం చెల్లిద్దామా అని చూడటం, ఎంత అన్యాయం చేద్దామా అని చూడటం దురదృష్టకరం. చట్టంలోని సెక్షన్ 107, 108లు చట్టంలో చెప్పిన దానికన్నా ఎక్కువ పరిహారం, పునరావాసం కల్పించడానికి రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాయి. నిర్వాశితులకు తగిన విధంగా న్యాయం చేయడానికి చట్టపరంగా ఎటువంటి అడ్డంకులూ లేవు. అడ్డంకులు అంటూ వుంటే అది ప్రభుత్వ ఆలోచనలోనూ, చిత్తశుద్ధిలోనే. అది దాచిపెట్టి చట్టం మా చేతులు కట్టేస్తుందని, చట్టం అమలు చేస్తే ప్రజలు అన్యాయం అయిపోతారని, వారి నోట్లో మన్ను పోయడమేనని పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. ఇది వంచన కాదా?

14 అయితే ప్రజలు ఎంత అడిగితే అంత ఇవ్వాలా? ఒక ప్రాతిపదిక అవసరం లేదా అనే ప్రశ్న రావచ్చు. అసలు భూములు, బతుకుతెరువు కోల్పోతున్న వారికి నష్టపరిహారం నిర్ణయించడానికి ప్రాతిపదిక ఏమిటి? వారు ప్రస్తుత స్థితి కన్నా మెరుగ్గా వుండాలి. కానీ నష్టపోకూడదనేది 2013 చట్టం ప్రకారం సూత్రం. అంటే ఆస్థి విలువ కానీ, దాని మీద వచ్చే బతుకు తెరువు విలువ కానీ ఇప్పటికన్నా తగ్గ కూడదు. అంటే ఇప్పుడెంత భూమి వుందో ప్రాజెక్టు తరువాత కూడా అంత భూమి కలిగి వుండటమో, అంత విలువ కలిగి వుండటమో, అంత భూమి కొనుక్కోగలిగి వుండటమో జరగాలి. ఆ భూమి నుండి ప్రస్తుతం వస్తున్న ఆదాయం కన్నా తక్కువ కాకూడదు.

15 ప్రభుత్వమేమో పాత ధరకు నష్టపరిహారం ఇస్తానంటుంది. ఆ డబ్బుతో వారు భూములు కొనుక్కోవాలంటే మాత్రం మార్కెట్‌లో వున్న కొత్త ధరకు కొనుక్కోవాలి. వాటి వ్యత్యాసం చాలా వుంది. ఇప్పుడు మల్లన్న సాగర్ పరిసర ప్రాంతాలలో బహిరంగ మార్కెట్లో ఎకరా భూమి 8 నుండి 12 లక్షల రూపాయల విలువ వుంది. ప్రభుత్వమేమో చట్టం ప్రకారం 1.8 లక్షలే ఇస్తాము, లేదా 123 జీ.వో. ప్రకారం 5-6 లక్షల రూపాయలు ఇస్తామంటుంది. ఆ డబ్బుతో అంతే భూమిని వారెలాగ కొనుక్కుంటారు? నిర్వాసితులకు ఇస్తామంటున్న ధరకే వారికి కొత్త భూములను అందుబాటులోకి తీసుకువచ్చే బాధ్యత

ప్రభుత్వమే ఎందుకు తీసుకోదు? అప్పుడు ఎవ్వరూ నష్టపోరు, ఎవ్వరూ త్యాగాలు చేయాల్సిన అవసరం లేదు.

16 సాగునీటి ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులయ్యే వారికి అత్యంత ముఖ్యమైనది భూమికి బదులు భూమిని పరిహారంగా ఇవ్వడం. ఇది 2013 చట్టం ద్వారానే సాధ్యమవుతుంది. ఈ విషయాన్ని ఎందుకు ప్రభుత్వం అస్సలు చర్చకు రానివ్వడంలేదు?

17 ప్రభుత్వం నిజంగా రైతుల కోసమే ఈ సాగునీటి ప్రాజెక్టులు అంటున్నప్పుడు మరి నిర్వాసితులను రైతులుగా ఎందుకు గుర్తించరు? వారు రైతులుగా కొనసాగడానికి ప్రభుత్వం ఎందుకు అవకాశం కల్పించడం లేదు? వ్యవసాయం మాత్రమే జీవనాధారంగా వున్న కుటుంబాలు మీరు ఇచ్చే డబ్బులతో ఎలా బతుకుతారు? జీ.వో. 123 కింద ఒక ఎకరాకు ఇచ్చే డబ్బుతో ఆ పక్క గ్రామాలలో లేదా సాగునీటి సదుపాయం కలిగిన భూమి పది గుంటలు కూడా రావు. చట్టం ప్రకారం అవకాశం వున్నా కూడా ఎందుకు ప్రభుత్వం నిర్వాశిత కుటుంబాలకు భూమికి భూమి ఇవ్వడానికి ఇష్టపడటం లేదో స్పష్టం చేయాలి.

18 డిజైన మార్పు ద్వారా ఒక్క మల్లన్న సాగర్ కోసమే అదనంగా దాదాపు 20 వేల ఎకరాలు సేకరించడానికి సిద్ధమైన ప్రభుత్వం, ఆ ప్రాజక్టు కోసం భూములు కోల్పోతున్న రైతుల కోసం మరో 10-15 వేల ఎకరాలు కొత్తగా వచ్చే ఆయకట్టులో సేకరించడానికి ఎందుకు ముందుకు రావడం లేదు? ఈ 14 గ్రామాల ప్రజలే ఎందుకు వారి బతుకులను, బతుకుతెరువులను పూర్తిగా త్యాగం చేయాలి? అసలు రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒకరి ప్రయోజనాల కోసం మరొకరు త్యాగం చేయడమేమిటి? ఒకరిని కొట్టి ఇంకొకరికి పెట్టడమేమిటి ?

19 ప్రభుత్వం చెబుతున్నట్టు ప్రాజెక్టు వల్ల 1.50 లక్షల ఎకరాలకు సాగు నీటి సదుపాయం కలిగితే, ఆ మేరకు ఆ భూముల విలువ, వాటి పై పండే పంటల విలువ పెరుగుతున్నప్పుడు, తద్వారా లాభపడే వారి నుండి పది శాతం భూములు తీసుకుని 15,000 ఎకరాలు నిర్వాశితులకు ఎందుకివ్వరు? ఆ ఆయకట్టు కింద పెద్ద మనుషుల భూములుంటాయనా? ఒకటికి నాలుగు రెట్లు లాభ పడుతున్నవారు సూది మొనంత త్యాగం కూడా చేయకుండా, నిర్వాశితులను మాత్రం నిలువు దోపిడీ చెయ్యటమేమిటి? ఇదేం న్యాయబద్ధ పాలన? ప్రాజక్టుల ద్వారా తెలంగాణ భూములను పచ్చగా చేస్తామంటున్న ప్రభుత్వం ఆ పచ్చదనంలో నిర్వాసితులకు న్యాయమైన వాటా కల్పించడానికి ఎందుకు ఇష్టపడటం లేదు?

20 2013 చట్టం ద్వారా భూమికి నష్టపరిహారానికి అదనంగా కల్పించాల్సిన ప్రయోజనాలు/హక్కులు:

21 నిర్వాసితులు అయినా కాకపోయినా, భూమి ఉన్నా లేకున్నా ప్రాజెక్టు వల్ల ప్రభావితులవుతున్న కుటుంబాలకు పునరావసం కింద ఒకే సారి కోరుకుంటే కుటుంబానికి 5 లక్షల రూపాయలు చెల్లించాలి లేదా నెలకు రూ. 2,000 చొప్పున 20 ఏళ్ల పాటు చెల్లించాలి లేదా కోరుకుంటే ఇంటికి ఒక ఉద్యోగం(కనీస వేతనాలకు తగ్గకుండా) ఇవ్వాలి. ఒకే సారి రీసెటిల్మెంట్ అలవెన్సు కింద 50 వేల రూపాయలు చెల్లించాలి. ఇది వారి భూములకు పొందే నష్టపరిహారానికి అదనం.

22 భూమి కోల్పోయిన వారికి నెలకు 3000 చొప్పున ఒక సంవత్సరానికి 36,000

23 నిర్వాసితులైన వారికి రవాణా ఖర్చుల కింద కుటుంబానికి 50 వేల రూపాయలు

24 పశువుల కొట్టం/పాక/చిన్న దుకాణాలకు పరిహారం కింద 25,000 రూపాయలు

25 వ్యవసాయేతర భూమి కోల్పోయిన చేతి వృత్తుల వారికి 25,000 రూపాయలు

26 ప్రభుత్వ గృహ నిర్మాణ పథకంలో ఇంటికి ఇల్లు, ఇల్లులేని వారికి కూడా ఇల్లు, కోరుకుంటే ఇంటికి బదులు కోల్పోతున్న ఇంటి విలువ

27 ఊరు మొత్తం మునుగుతుంటే లేదా ఖాళీ చేయాల్సి వస్తే కొత్త ఊరుని 25 రకాల సౌకర్యాలు/మౌలిక వసతులతో, తగిన స్థలంలో ప్రస్తుత స్థితికి తగ్గకుండా నిర్మించాలి.

28 సాగునీటి ప్రాజక్టు అయితే నిర్వాశితులు/ప్రభావితులందరికీ రిజర్వాయరులో చేపలు పట్టుకునే హక్కు అదనం

29 ఎస్సీ, షెడ్యూల్డ్ ప్రాంతంలోని ఎస్టీలకు 50 వేలు అదనం

30 పై విషయాలన్నీ దాచి డబుల్ బెడ్ రూం పేరు మీద రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉదారంగా 5 లక్షల రూపాయలు ఇస్తున్నట్లు నమ్మబలుకుతుంది. సొంత భూమి లేకపోయినా గ్రామంలో వున్న భూములపై ఆధారపడి బతుకుతున్న వ్యవసాయ కూలీలకు జీ.వో. 123 ద్వారా వచ్చేది గుండు సున్నా అని ప్రభుత్వం ఎందుకు చెప్పడం లేదు ? 1-2 ఎకరాలలోపు వున్న కుటుంబాలకు ఈ 5.50 లక్షల రూపాయలు పెద్ద ఆసరా అవుతాయనే విషయం ప్రభుత్వానికి తెలియదా? సొంత భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలు తెలంగాణ ప్రజలు కారా? వారి ప్రస్తుత జీవనోపాధిని ధ్వంసం చేసి ఏ విధమైన పరిహారాన్ని, ప్రత్యామ్నాయాన్ని కల్పించకుండా తెలంగాణ ప్రభుత్వం తప్పుకోవడం అమానవీయం కాదా ?

31 2013 చట్టం ద్వారా వచ్చే పై హక్కులను, పునరావాస ఫలాలను ప్రభుత్వం ఎందుకు దాచిపెడుతుంది? వీటి విలువను మొత్తం అంచనా వేసి అన్నీ కలిపి ఒకే సారి 123 జీ.వో. ద్వారా ఏక మొత్తంగా పరిహారం అందచేస్తున్నామని ప్రభుత్వం చెప్పవచ్చు. అయితే నగదు పరిహారం రూపంలో చూసినా పై న పేర్కొన్న వాటిని కలుపుకుంటే ప్రభుత్వం ఇచ్చే పరిహారానికన్నా ఎక్కువే వస్తుంది. అంతే గాక గ్రామంలో వివిధ వర్గాలు వివిధ రూపాలలో భూమి మీద, ఊరు మీద ఆధారపడి బతుకుతారు. వారికి జరిగే నష్టాన్ని కేవలం డబ్బుతో పూడ్చలేరు. అందుకే 2013 చట్టంలో భూమికి భూమి, భూమిలేని వారికి పునరావాసం, ఊరుకు ఊరు కల్పించే విధంగా ఏర్పాట్లు చేశారు.

32 మల్లన్నసాగర్ లో ముంపుకు గురౌతున్న భూములకు ఇచ్చే పరిహారం దేశం మరియు ప్రపంచంలోనే నెంబర్ వన్ అనే మాట అత్యంత హాస్యాస్పదం, సత్యదూరం, పచ్చి అబద్ధం అని మేము ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎందుకంటే ఆ విషయం ప్రభుత్వానికీ తెలుసు. పక్క రాష్ట్రం, ఆర్థికంగా కష్టాలలో వున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగునీటి ప్రాజక్టుల కోసం తీసుకున్న భూములకు ఎకరానికి 30 లక్షలకు పైగా నష్ట పరిహారం చెల్లించిందనే విషయాన్ని మీరు దాచలేరు. సొంత తెలంగాణ ప్రజలనే మోసం చేయడానికి ఇంత పచ్చి అబద్దాలు చెప్పగలిగే ధైర్యం, అనైతికత తెలంగాణ ఉద్యమానికి సారధ్యం వహించిన పార్టీకి ఇంత తక్కువ కాలంలో రావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. తెలంగాణకు ద్రోహం జరగలేదని ఆంధ్రపాలకులు ఇప్పటివరకు చెప్పినట్టుగానే ఈ ప్రభుత్వం, పాలకులు కూడా అనత్యాలకు ఒడిగట్టడం అత్యంత దురదృష్టకరం.

33 ఇప్పటి వరకూ 2-3 లక్షల రూపాయలకంటే ఎక్కువ పరిహారం ఎవ్వరూ చెల్లించలేదు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం చెల్లిస్తున్న పరిహారం ఉత్తమమైనది అనే ప్రభుత్వ వాదన అర్థం లేనిది. భూ సేకరణలో జరిగిన ఇటువంటి అన్యాయాన్ని కొంతమేరకైనా సరిదిద్దటానికే 2013 చట్టం వచ్చింది. ఆ చట్టం రాకముందు చెల్లించిన పరిహారాన్ని ప్రామాణికంగా తీసుకుని మేము ఇంకా ఎక్కువ ఇస్తున్నామనడం సరి కాదు. ఈ చట్టం వచ్చిన తరువాత ఇతర రాష్ట్రాలు ఎటువంటి పరిహారం, పునరావాసం ఇస్తున్నారో వాటితో పోలిస్తే కొంత అర్థం ఉంటుంది. అయినా పైన చెప్పినట్లు భూములు, బతుకులు కోల్పోతున్న ప్రజలకు ఎంత, ఏ రూపాల్లో నష్టం జరుగుతుందో అంచనా వేసి ఆ నష్టాన్ని పూడ్చడం ప్రభుత్వ బాధ్యత.

34 అసలు పరిహారమంటే డబ్బులు మాత్రమే కాదు. ప్రాజెక్టుల కారణంగా భూములు, బతుకులు కోల్పోతున్నవారికి పూర్తి స్థాయిలో వారి బతుకును వారికి పునర్నిర్మించి ఇవ్వడం ద్వారానే వారికి సరైన న్యాయం జరుగుతుంది. వారిని మనుషులుగా కాకుండా కేవలం వస్తువులుగా పరిగణించేవారే వారే, వారి భూములకు కేవలం డబ్బులతో విలువ కట్టగలుగుతారు. ప్రసుత్తం ప్రభుత్వం చేస్తున్నదదే.

35 వీటన్నింటినీ మించి 2013 చట్టం కల్పించిన

ముఖ్యమైన హక్కు ప్రశ్నించే అవకాశం. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా వుండటం, ప్రాజెక్టుల నిర్ణయం నుండి పరిహారం, పునరావాసం వరకు అన్నీ పారదర్శకంగా చేయడం. గ్రామ సభలు పెట్టి ప్రాజెక్టు వివరాలు ప్రజలకు తెలియచేయడం, వారి అభిప్రాయాలు తీసుకోవడం, పరిహారం, పునరావాసం గురించి వారి ఆలోచనలు, ఆకాంక్షలను తెలుసు కోవడం, వాటి ఆధారంగా పరిహారం, పునరావాసం కల్పించడం. ఇవన్నీ ప్రభుత్వం చేయడం లేదు. నిజంగా ప్రాజెక్టు నిర్ణయంలో ఏ లోపమూ లేకపోతే ప్రభుత్వం ఈ ప్రక్రియంతా జరపటానికి ఎందుకు భయపడుతుంది? అసలు ఇంత పెద్ద ప్రాజక్టుకు పూర్తి స్థాయి డిజైన్, నివేదిక, పర్యావరణ అనుమతి, ఇతర సాగునీటి సంబంధిత అనుమతులు లేకుండా భూ సేకరణ చేయడమేమిటి? పర్యావరణ అనుమతి తీసుకునేముందు పర్యావరణ ప్రభావ నివేదిక తయారు చేసి, తెలుగులో ఆ ప్రతులను ప్రజలకు వివరించి, బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేసి ఆ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించాల్సి వుండటం వాస్తవం కాదా? అవేమీ చేయకుండా ప్రభుత్వం భూ సేకరణ ఎలా చేపడుతుంది? ఇది చట్ట ఉల్లంఘన కాదా?

36 2013 చట్టం అమలు చేస్తే నష్టపరిహారం పొందడానికి 5-10 ఏళ్లు పడుతుందని, కోర్టులు చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి వుంటుందని గౌరవ మంత్రి గారు చెప్పడం సిగ్గుచేటు. ప్రభుత్వం ప్రజలు కోరుకుంటున్న పరిహారం ఇస్తే వారికి కోర్టుకెళ్లాల్సిన అవసరం ఏముంటుది? ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తే తప్ప పరిహారం, పునరావాసం ఆలస్యమెందుకవుతుంది? మరో ముఖ్యమైన విషయం ప్రజలకు పూర్తిగా పరిహారం, పునరావాసం కల్పించిన తరువాతే వారిని భూములనుండి, ఇళ్ల నుండి తొలగించాలని అప్పటి వరకు గ్రామాలను ముంపుకు గురిచేయరాదని 2013 చట్టం చెపుతుంది. ఇటువంటి స్పష్టమైన రక్షణలు ఉన్నప్పుడు వారికి త్వరితగతిన పరిహారం, పునరావాసం కల్పించడానికి ప్రభుత్వం చెప్పులరిగేలా తిరగాల్సి వుంటుంది కాని ప్రజలు కాదు.

37 మొత్తంగా కొంత మంది ప్రజల బతకులు నాశనమయితేనే, వారు త్యాగాలు చేస్తేనే మరింత మందికి లాభం చేకూరుతుందనే విధమైన అభివద్ధి నమూనాను ప్రభుత్వం చేపట్టడం ఎంత వరకు న్యాయం? ఇంతకు ముందు ఆంధ్ర పాలకులు కూడా చెప్పిందదే కదా? ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివద్ధికి తెలంగాణ ప్రాంత ప్రజలను త్యాగాలు చేయమన్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివద్ధికి మా గ్రామాల ప్రజలను, ఇంకా వివిధ ప్రాజెక్టు బాధిత ప్రజలను త్యాగం చేయమంటున్నారు. మరి ఆంధ్రపాలకులకు మీకు తేడా ఏమిటి? అప్పుడు ఏ సూత్రాలమీద తెలంగాణ కోసం కొట్లాడినామో ఇప్పుడు అదే సూత్రాలమీద మేము మా గ్రామాల కోసం, మా బతుకుల కోసం కొట్లాడుతున్నాం. మరి ఇప్పుడు తప్పెట్లా అయితది. మా భూములు, మా నీళ్లు, మా నిధులు, మా నియామకాలు అనేది ఒక రాష్ట్రం పరిధికే పరిమితమా? ప్రతి గ్రామానికి ఆ సూత్రం ఎందుకు వర్తించదు? మొత్తంగా ఒకరిని మరొకరు దోపిడీ చేయకూడదనేది మూల సిద్ధాంతం అయితే మా గ్రామాల ప్రజలను దోపిడీకి, అన్యాయానికి గురిచేసి మరొకరికి మేలు చేయడం ఎంత వరకు సమంజసం?

38 ప్రభుత్వం ప్రాజెక్టు నిర్ణయించిన తీరు కానీ, జీ.వో. 123 కింద కేవలం నగదు రూపంలో ఇస్తామని చెబుతున్న పరిహారం కానీ, ప్రజలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ప్రవర్తిస్తున్న తీరు కాని తెలంగాణ సాధన పోరాటం స్థాపించిన విలువలకు పూర్తి విరుద్ధం. ఆ విలువలను పాతరేస్తున్నది తెలంగాణ సాధన పోరాటానికి సారధ్యం వహించిన పార్టీయే అవటం అత్యంత దురదృష్టకరం. ఒక సారి ప్రజలలో నాటిన ప్రశ్నలు, విలువలను ప్రభుత్వాలు, పార్టీలు చెరిపివేయటం సాధ్యం కాదు. అవి మిమ్ములను వెన్నాడు తూనే వుంటాయని, వాటికి జవాబు చెప్పాల్సిన బాధ్యత మీ మీద వుంటుందని తెలియచేసుకుంటున్నాం.

మల్లన్న సాగర్ ప్రాజెక్టు క్రింద ముంపుకు గురయ్యే వ్యవసాయ భూములు, గ్రామాలు

మండలం	గ్రామం	సేకరించే భూమి (ఎకరాలు)	పట్టా భూములు	అసైన్డ్ భూములు	ప్రభుత్వ భూమి (ఖాళీగా)	భూమి కొనుగోలు పథకం క్రింద ఇచ్చిన భూములు	ఇనాం భూమి	అటవీ భూములు	వక్ఫ్ భూములు	దేవాదాయ భూములు	ఇళ్ల స్థలాలు	మొత్తం ప్రభుత్వ భూమి	ఇళ్లు
తొగుట	ఎల్లారెడ్డి పేట	177.04	65.00	34.23	31.32	45.29	0.00	0.00	0.00	0.00	0.00	112.04	0.00
తొగుట	తుక్కాపూర్	911.20	240.01	277.20	335.20	0.00	49.19	0.00	0.00	0.00	0.00	671.19	0.00
తొగుట	తొగుట*	2,996.19	1,091.07	490.26	381.14	0.00	219.01	0.00	0.00	0.00	0.00	1,605.12	177.00
తొగుట	మేములఘాట్*	5,172.14	2,104.08	292.10	522.36	0.00	415.32	1821.05	5.01	4.19	6.23	3,068.06	615.00
తొగుట	పల్లెపహాడ్*	1,199.00	813.10	65.35	68.03	0.00	83.22	150.00	0.00	3.10	15.00	385.30	482.00
తొగుట	ఏటిగడ్డకిష్టాపూర్*	2,518.22	1,592.18	254.23	528.26	0.00	62.35	0.00	0.00	0.00	0.00	926.04	570.00
	మొత్తం	**12,674.39**	**5,906.04**	**1,413.40**	**1866.31**	**54.29**	**829.09**	**2485.16**	**5.01**	**7.29**	**21.23**	**6,768.35**	**1,844.00**
కొండపాక	కొనాయిపల్లి	10.23	10.23	0.00	0.33	0.00	0.00	0.00	0.00	0.00	0.00	0.00	0.00
కొండపాక	సింగారం	1,088.00	888.25	6.19	156.00	0.00	0.00	0.00	0.00	0.00	0.00	199.15	318.00
కొండపాక	ఎర్రవల్లి	2,180.00	721.00	64.00	482.00	0.00	0.00	913.00	0.00	0.00	0.00	1,459.00	455.00
కొండపాక	తిప్పారం	75.04	55.24	0.00	19.20	0.00	0.00	0.00	0.00	0.00	0.00	19.20	0.00
కొండపాక	మంగోలు	17.00	17.00	0.00	0.00	0.00	0.00	0.00	0.00	0.00	0.00	0.00	0.00
	5 గ్రామాలు	**3,370.27**	**1,692.32**	**0.00**	**0.00**	**0.00**	**0.00**	**0.00**	**0.00**	**0.00**	**0.00**	**1677.35**	**0.00**

*2 గ్రామాలు (1 కాలనీ, 1 జి.పి)/ (1 హామ్లెట్ + 1 జి.పి) / (1 హామ్లెట్ + 1 జి.పి)/ (2 అమ్లెట్ + 1 జి.పి)

షెడ్యూల్ 2

భూ సేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయ బద్ధమైన నష్టపరిహారం, పారదర్శకత హక్కు చట్టం 2013 ప్రకారం ప్రభావిత ప్రజలకు అందవలసిన హక్కులు, సౌకర్యాలు

మల్లన్న సాగర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల పోరాట సంఘీభావ కమిటీ

ప్రజల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా 2013 భూ సేకరణ చట్టం వచ్చింది. ఈ చట్టం 2014 జనవరి 1 నుండీ అమలులోకి వచ్చింది. కానీ కంపనీలకు, పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా విధానాలు రూపొందించి అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఈ చట్టాన్ని పూర్తిగా పక్కకు పెట్టి, జీ.వో.లను తెచ్చి (తెలంగాణాలో తెచ్చిన జీ.వో. 123, ఆంధ్రప్రదేశ్ రాజధాని కోసం సాగించిన భూమి సమీకరణ లాంటివి) గ్రామీణ రైతుల చేతుల్లో నుంచి భూమిని కాజేసే ప్రయత్నాలు వేగమందుకున్నాయి. ఈ జీ.వో.లకు చట్ట బద్ధత లేదనీ, 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలనీ కోరుతున్నవారిని అభివృద్ధి నిరోధకులుగా ప్రభుత్వం అభివర్ణిస్తున్నది. పైగా 2013 చట్టం కంటే 123 జీ.వో. గొప్పదనీ, ఈ జీ.వో. ప్రకారం భూములను ప్రభుత్వానికి స్వాధీనం చేయకపోతే కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తుందనీ, సాక్షాత్తూ మంత్రులే ప్రజలను హెచ్చరిస్తున్నారు. 2013 చట్టం మొత్తాన్ని అమలు చేయకపోగా, నష్టపరిహారానికి సంబంధించి కూడా ప్రజలకు నష్టమే చేస్తున్నారు. 2013 చట్టం కల్పించిన ఏ ఒక్క హక్కునూ, సౌకర్యాన్నీ ప్రభావిత ప్రజలకు అందించేందుకు ప్రభుత్వాలు సిద్ధం కావడం లేదు. అసలు వాటి పై ప్రజలకు అవగాహనే కల్పించడం లేదు. ఈ నేపథ్యంలో 2013 చట్టం న్యాయ బద్ధమైన నష్టపరిహారంతో పాటు, షెడ్యూల్ 2, షెడ్యూల్ 3 ప్రకారం ఏఏ సౌకర్యాలు, హక్కులు అందించాలో క్రింద ఇస్తున్నాం. ప్రభుత్వం మీ భూముల కోసం వస్తే... ఈ విషయాలను నిగ్గదీసి అడగాలని కోరుతున్నాం.

షెడ్యూల్ 2

(సెక్షన్లు 31 (1), (38)(1), 105(3) చూడాలి)

షెడ్యూల్ 1లో తెలిపిన వాటికి అదనంగా, బాధిత కుటుంబాలకు అందరికీ (సేకరించ తలపెట్టిన భూమి యజమానులతో పాటు, ఆ భూమి మీదనే ప్రధానంగా ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు అన్నీ) అందించవలసిన పునరావాసం, రీసెటిల్‌మెంట్ ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలు.

క్ర.సం.	పునరావాసం, పునఃస్థాపన ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలు	ప్రయోజనం/ అంశం	ప్రయోజనం అందించారా, లేదా? (ఒక వేళ అందిస్తే వాటి వివరాలు)
(1)	(2)	(3)	(4)
1.	నిర్వాసితులైతే, ఇండ్లు ఇవ్వడం	(1) గ్రామీణ ప్రాంతాలలో ఇల్లు కోల్పోతే, ఇందిరా ఆవాస యోజనా ప్రమాణాల మేరకు నిర్మించిన ఇంటిని ఇవ్వాలి. పట్టణ ప్రాంతాలలో ఇల్లు కోల్పోతే, 50 చదరపు మీటర్ల నిర్మాణ స్థలంకన్నా తక్కువ కాని విస్తీర్ణంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలి.	

		(2) సేకరించిన ప్రాంతంలో, ఇంటి స్థలం లేనప్పటికీ, నోటిఫికేషన్ ప్రకటించిన తేదీ నాటికి కనీసం మూడేళ్ల పాటు అదే ప్రాంతంలో నివసించి ఉంటే, అటువంటి వారు బలవంతంగా నిర్వాసితులు అయితే, అట్టి బాధిత కుటుంబాలకు కూడా, పైన తెలిపిన ప్రయోజనాలను వర్తింపచేయవచ్చు. అయితే, నిర్మించిన ఇంటిని ఇచ్చినప్పుడు, ఏదైనా కుటుంబం దానిని తీసుకోవడానికి అంగీకరించని పక్షంలో, అట్టి కుటుంబానికి ఇల్లు కట్టుకోవడానికి వీలుగా, ఒకే దఫాగా, ఆర్థిక సహాయం అందించవచ్చు. పట్టణ ప్రాంతాలలో అయితే, ఇది 1,50,000 రూపాయలకు తక్కువ కాకూడదు. సహాయానికి అంగీకరించిన పక్షంలో, అట్టి కుటుంబానికి నిర్మించి ఇవ్వడానికి ప్రతిపాదించిన ఇంటికి అయిన వ్యయానికి సరిపడా సమాన స్థాయిలో డబ్బును ఇవ్వాలి. ఈ చట్టం ప్రకారం, భూ సేకరణ వల్ల నష్టపోయిన ప్రతి కుటుంబానికి ఒక ఇంటి కన్నా ఎక్కువ ఇండ్లను ఇవ్వకూడదు. **వివరణ:** నగర ప్రాంతాలలో అయితే, బహుళ అంతస్తుల భవనాలలో కూడా, బాధిత కుటుంబాలకు ఇండ్లను కేటాయించవచ్చు.
2.	భూమికి భూమి	సాగు నీటి ప్రాజెక్టు అయితే, బాధిత ప్రాంతంలో వ్యవసాయ భూమి ఉండి, అట్టి భూమిని సేకరించడం లేదా కోల్పోవడం జరిగితే, అట్టి భూమిని సేకరించడం లేదా కోల్పోవడం వల్ల, సదరు బాధిత కుటుంబం, చిన్న స్థాయి రైతులేదా భూమి లేని కుటుంబంగా మారితే, అట్టి బాధిత కుటుంబంలో ఎవరిపేరునైతే, భూమిపై రికార్డుల పరంగా హక్కులు ఉంటాయో, వారిలో ప్రతి ఒక్కరికీ, సేకరించిన ప్రాంతంలో చేపట్టబోయే సాగునీటి ప్రాజెక్టు ఆయకట్టులో కనీసం ఒక్కో ఎకరం సాగు భూమిని వీలైన మేరకు ఇవ్వవలసి ఉంటుంది. అయితే, సదరు బాధిత ప్రాంతంలో, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులకు చెందినవాళ్లు భూమిని కోల్పోతే, అట్టి కుటుంబాలకు, వారి నుంచి సేకరించిన భూమికి సమానంగా అంతే భూమిని లేదా రెండున్నర ఎకరాలు, ఏది తక్కువైతే అది తప్పని సరిగా ఇవ్వాలి.
3.	అభివృద్ధి చేసిన భూమి ఇవ్వడం	పట్టణీకరణ కోసం భూమిని సేకరిస్తే, అలా అభివృద్ధి చేసిన భూమిలో 20 శాతం భూమిని, భూమిని కోల్పోయిన ప్రాజెక్టు బాధిత కుటుంబాలకు కేటాయించి, వారి నుంచి సేకరించిన భూమి విస్తీర్ణం, భూ సేకరణ వ్యయం, అభివృద్ధికి అయిన వ్యయం వంటి అంశాల ప్రాతిపదికన, ఆయా కుటుంబాలకు అందించాలి. అయితే, ప్రాజెక్టు బాధిత కుటుంబం ఈ అవకాశం తీసుకోదలిస్తే దీనికి సరిపడా మొత్తాన్ని సదరు కుటుంబానికి చెల్లించే భూ సేకరణ పరిహార ప్యాకేజి నుంచి మినహాయించవచ్చు.

4.	వార్షిక భృతి లేదా ఉద్యోగ అవకాశాలను వినియోగించుకునే వెసులుబాటు	బాధిత కుటుంబాలకు, ఈ కింద తెలిపిన అవకాశాలు ఉండేలా, అధీకృత ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టాలి. (ఎ) ప్రాజెక్టు వల్ల ఉద్యోగాలు కల్పించబడితే, అప్పటికి అమలులో వున్న చట్టాల మేరకు, కనీస వేతనాల చెల్లింపు ప్రాతిపదికన, బాధిత కుటుంబంలో కనీసం ఒక్కరికి, అవసరమైన రంగంలో శిక్షణ, నైపుణ్యాల అభివృద్ధికి అవకాశం కల్పించి, ఉద్యోగ అవకాశం ఇవ్వడం; లేదా అవసరానికి అనుగుణంగా, అలాంటి మరో ప్రాజెక్టులోనో ఉద్యోగం ఇవ్వడం; లేదా, (బి) ప్రతి బాధిత కుటుంబానికి, ఒకే దఫాగా ఐదు లక్షల రూపాయల చెల్లింపు; లేదా (సి) ప్రతి కుటుంబానికి, నెలకు కనీసం రెండు వేల రూపాయల లెక్కన, 20 ఏళ్ల పాటు వార్షిక చెల్లింపులు, ఈ క్రమంలో, వ్యవసాయ కూలీల కోసం, అనువైన వినియోగ ధరల సూచీని కూడా ప్రామాణికంగా తీసుకోవాలి.
5.	బాధిత కుటుంబాలకు ఏదాది కాలం పాటు జీవన మనుగడ భృతి/ వేతనం	సేకరించతలపెట్టిన భూమిని కోల్పోవడం వల్ల నిర్వాసితులైన ప్రతి కుటుంబానికి, అవార్డు ప్రకటించిన తేదీ నుంచి ఏడాది కాలం పాటు, నెలకు కనీసం మూడు వేల రూపాయల లెక్కన నెలసరి జీవన మనుగడ వేతనం చెల్లించాలి. బాధిత కుటుంబాలు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులకు చెందినవి అయితే, పైన తెలిపిన మనుగడ వేతనంతో పాటు, 50 వేల రూపాయలు అదనంగా చెల్లించాలి. షెడ్యూల్డ్ ఏరియాల్లో నిర్వాసితులు అయ్యే సందర్భాలలో, బాధితులయ్యే గిరిజన జాతులకు చెందిన కుటుంబాలు, వీలైనంత మేరకు, వారి ఆర్థిక అవకాశాలు, భాష, సంస్కృతి, సాముదాయిక జీవన విధానం కాపాడుకునే రీతిలో వారికి అదే తరహా పర్యావరణ ప్రాంతంలో పునరావాసం కల్పించాలి.
6.	బాధిత కుటుంబాలకు రవాణా ఖర్చులు	నిర్వాసితులైన ప్రతి బాధిత కుటుంబానికి, కుటుంబాన్ని, భవన సామగ్రిని, ఇతర వస్తువులను, పశుజీవాలను, తరలించే నిమిత్తం, రవాణా ఖర్చులుగా, ఒకే దఫాగా 50 వేల రూపాయలు ఆర్థిక సాయంగా అందించాలి.
7.	పశువుల కొట్టాలు / చిన్న చిన్న దుకాణాలకు వ్యయ చెల్లింపులు	పశు జీవాలకు కొట్టాలు లేదా చిన్న చిన్న దుకాణాలు కలిగి వున్న బాధిత కుటుంబాలకు, వేరేచోట తిరిగి వారిని నిర్మించుకునేందుకు వీలుగా, కనీసం 25 వేల రూపాయలకు తక్కువ కాకుండా, అధీకృత ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా తగు మొత్తాన్ని నిర్ధారించి, వారికి అందించాలి.
8.	వృత్తి పనివాళ్లు	వృత్తి పనివాళ్ళు,చిన్న చిన్న వ్యాపారస్తులు, స్వయం ఉపాధి కలిగిన వాళ్లకు చెందిన బాధిత ఇలాంటి వాళ్లకు ఒకే దఫాగా కుటుంబం లేదా బాధిత ప్రాంతంలో వ్యవసాయేతర ఆర్థిక సాయం లేదా వాణిజ్య, పారిశ్రామిక లేదా ఏదైనా సంస్థాగత

		నిర్మాణం కలిగి వున్న బాధిత కుటుంబం, సదరు భూ సేకరణ వల్ల నిర్వాసితులైతే, అట్టి ప్రతి కుటుంబానికి, కనీసం 25 వేల రూపాయలు తక్కువ కాకుండా, ఒకే దఫాగా చెల్లించేటట్లు, ఒక నోటిఫికేషన్ ద్వారా అధీకృత ప్రభుత్వం తగు మొత్తాన్ని నిర్ధారించి, సదరు కుటుంబాలకు ఆ ఆర్థిక సాయం అందించాలి.
9.	చేపలు పట్టడంపై సంబంధిత హక్కులు	సాగునీటి ప్రాజెక్టులు లేదా జల విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి, బాధిత కుటుంబాలకు, అధీకృత ప్రభుత్వం నిర్ధారించిన రీతిలో, రిజర్వాయర్లలో చేపలు పట్టుకోవడానికి సంబంధించిన హక్కులు కల్పించాలి.
10.	ఒకే దఫాగా రీ సెటిల్‌మెంట్ వేతనం	ప్రతి బాధిత కుటుంబానికి ఒకే దఫా రీ సెటిల్‌మెంట్ వేతనంగా 50 వేల రూపాయలు చెల్లించాలి.
11.	స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు	(1) బాధిత కుటుంబాలకు కేటాయించే భూమి లేదా ఇంటి రిజిస్ట్రేషన్‌కు స్టాంపు డ్యూటీ, ఇతర ఫీజుల పరంగా అయ్యే వ్యయాన్ని భూమి అవసరం వున్న సంస్థనే భరించాలి. (2) బాధిత కుటుంబాలకు కేటాయించే భూమి లేదా ఇల్లు ఎటువంటి వివాదాలు /చిక్కులలో కూరుకుని ఉండకూడదు. (3) బాధిత కుటుంబాలకు కేటాయించే భూమి లేదా ఇంటిని, ఆయా కుటుంబంలో భార్య, భర్త ఉమ్మడి పేరు మీద కేటాయించాలి.

షెడ్యూల్ 3 **(సెక్షన్ 32, సెక్షన్ 38(1), సెక్షన్ 105(3) చూడాలి)**

మౌలిక / కనీస సౌకర్యాలను కల్పించడం

నిర్వాసితులన కుటుంబాలు వేరే చోట పునరావాసం పొందడానికి వీలుగా, సదరు ప్రాంతాలలో ఈ క్రింద తెలిపిన మౌలిక, కనీస సౌకర్యాలను కల్పించవలసిన బాధ్యత భూమి కోరుకుంటున్న సంస్థదే. సదరు బాధిత కుటుంబాలు, కొత్త గ్రామం / ఆవాస ప్రాంతంలో, సహేతుకమైన జీవన ప్రమాణాలను పొందడంతో పాటు, నిర్వాసితులు కావడం వల్ల కలిగే మానసిక ఆందోళనను, అభద్రతను కొంత వరకు తగ్గించడానికి ఇది అవసరం.

ప్రజలు జీవించడానికి అనువైన, ప్రణాళికబద్ధమైన పునరావాస ప్రాంతం, కనీస స్థాయిలో ఈ క్రింద తెలిపిన సౌకర్యాలను కలిగి ఉండాలి.

క్ర.సం.	భూమి సేకరించే వాళ్ళు కల్పించవలసిన / ప్రతిపాదించిన మౌలిక సౌకర్యాలకు సంబంధించిన అంశం	భూమి సేకరించేవాళ్లు కల్పించిన మౌలిక సౌకర్యాల వివరాలు
(1)	(2)	(3)

1. పునరావాసం కల్పించిన గ్రామాలలో రోడ్డు సౌకర్యం, అన్ని వాతావరణ పరిస్థితులకు తట్టుకునే రీతిలో సమీపంలో వున్న పక్కా రోడ్డుకు లింకు రోడ్డు, దారులు, అన్ని బాధిత కుటుంబాలకు దారి హక్కులు సరిపడా స్థాయిలో కల్పించాలి.

2. సదరు పునరావాస ప్రాంతంలో, వాస్తవికంగా నివాసం ఉండడానికి ముందే, ఆ ప్రాంతంలో, సరైన డ్రైనేజి,

పారిశుద్ధ్య ప్రణాళికలు పూర్తి చేయాలి.

3. భారత ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు, ప్రతి బాధిత కుటుంబానికి ఒకటి లేదా అంతకన్నా సురక్షిత తాగునీటి వనరులను కల్పించడం.
4. పశు జీవాలకు తాగునీటి సౌకర్యం
5. రాష్ట్రంలో నిర్దేశించిన స్థాయి మేరకు పశు జీవాలకు మేత వనరులు కల్పించడం
6. సరిపడా స్థాయిలో చవక ధరల (పౌర సరఫరా) దుకాణాలు
7. అనువైన స్థాయిలో, పంచాయితీ కేంద్రాలు
8. పొదుపు ఖాతాలు తెరిచే సౌకర్యాలతో, అవసరమైన స్థాయిలో పోస్టాఫీసులు
9. అవసరమైన స్థాయిలో విత్తనాలు, ఎరువులు నిల్వ కేంద్రాలు
10. పునరావాసం పొందిన బాధిత కుటుంబాలకు కేటాయించిన వ్యవసాయ భూములకు సరైన స్థాయిలో సాగునీటి సదుపాయాలు కల్పించడం తప్పనిసరి. వీలైతే సాగునీటి ప్రాజెక్టును, లేకపోతే ఏదైనా ప్రభుత్వ పథకం లేదా ప్రత్యేక సాయంతో అనువైన సహకార వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా అవసరమైన సాగునీటి సౌకర్యం కల్పించాలి.
11. బాధిత కుటుంబాల పునరావాసం కోసం అభివృద్ధి చేసే అన్ని రీసెటిల్‌మెంట్ ప్రాంతాలలో, తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలి. స్థానిక బస్సు సదుపాయాలు కలిగిన ప్రజా రవాణా వ్యవస్థతో పాటు, సమీప ప్రాంతాలలోని పట్టణాలు/ అభివృద్ధి కేంద్రాలను కలిపే రవాణా సౌకర్యాలు కూడా అందులో ఉండాలి.
12. కులాలు, సముదాయాలు వారి వారి ఆచార సాంప్రదాయాలకు అనుగుణమైన రీతిలో శవ దహన వసతులు / స్మశాన వాటికలు
13. వ్యక్తిగత మరుగుదొడ్లతో పాటు, అవసరమైన పారిశుద్ధ్య సౌకర్యాలు
14. ప్రతి కుటుంబానికి వ్యక్తిగత కనెక్షన్‌లతో కూడిన కరెంటు సౌకర్యం (లేదా సౌరశక్తి వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఆసరాగా విద్యుత్ సౌకర్యం) అవసరమైన స్థాయిలో వీధి దీపాల ఏర్పాటు
15. చిన్న పిల్లలకు, పిల్లల తల్లులకు పోషకాహార సేవలను అందించే అంగన్‌వాడీ కేంద్రాలు
16. పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యా చట్టం, 2009 మేరకు పిల్లల విద్యాహక్కులను నెరవేర్చేందుకు వీలుగా పాఠశాల
17. రెండు కిలోమీటర్ల పరిధిలో ఉప ఆరోగ్య కేంద్రాలు
18. భారత ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
19. పిల్లలు ఆడుకునేందుకు స్థలాలు
20. ప్రతి 100 కుటుంబాలకు ఒక కమ్యూనిటీ సెంటరు.
21. దేవాలయాలు, ప్రజలు ఒక చోట సమావేశం అయ్యేందుకు వీలుగా, ప్రతి 50 కుటుంబాలకు ఒకటి లెక్కన, చౌపాల్ లేదా చెట్టుకింద వేదిక (బాధిత ప్రాంతంలో వున్న సంఖ్య, పరిమాణాల మేరకు)
22. సాంప్రదాయ గిరిజన సంస్థలకు ప్రత్యేకంగా భూమి కేటాయింపు
23. అటవీ నివాస కుటుంబాలకు, వీలైనంత వరకు కొత్తగా పునరావాసం పొందిన చోటకు దగ్గరే అందుబాటులో వున్న ఉమ్మడి వనరులు, కలపేతర అటవీ ఉత్పత్తులపై అటవీ హక్కులు కల్పించాలి. నిర్వాసితులైన ప్రాంతానికి సమీపంలో వున్న అడవి లేదా ఉమ్మడి వనరులు వారికి ఇంకా అందుబాటులో ఉండి, వాటిపై ఆధారపడి బతుకుతుంటే, ఆ బతుకు తెరువు వనరులపై వారికి ఉన్న హక్కులను యధా ప్రకారం కొనసాగనివ్వాలి.
24. అవసరమైతే, కొత్తగా పునరావాసం పొందిన, అనువైన రక్షణ వ్యవస్థలను కల్పించాలి.
25. నిబంధనల మేరకు పశు వైద్య, ఆరోగ్య కేంద్రాలు

నోట్: కాలమ్ 2లో 1-25 వరకు పొందుపర్చిన మౌలిక సౌకర్యాలలో ప్రతి అంశానికి సంబంధించి, భూమి సేకరించే వాళ్ళు కల్పించిన సదుపాయాలను, కాలమ్ 3లో తెలపాలి.

వరిలో భూసార యాజమాన్యం

ప్రధానం పొలం తయారీ

విత్తనం వేయడానికి నారుమడిని సిద్ధం చేస్తు న్నప్పుడే, నారు నాటాల్సిన ప్రధాన పొలాన్ని తయారు చేయడం కూడా మొదలెట్టాలి. పొలాన్ని దున్నడం, చదును చేయడమే గాక, నేలను సారవంతం చేసే పనులు కూడా చేపట్టాలి. సేంద్రియ సేద్యం విధానంలో సులభంగా దొరికే దిబ్బ ఎరువు, వేపచెక్క వంటివి వేయాలి. వీటితో పాటు, అజోస్పైరిల్లమ్ వంటి జీవన ఎరువులు, అమృత జలం, జీవామృతం వంటి ద్రావణాలు ఉపయోగించి నేలలో సూక్ష్మజీవులను అభివృద్ధి చేసుకోవాలి.

వరి సాగు చేయడానికి ఎంచుకున్న భూమిని చదును చేసుకోవాలి. నీళ్ళు పెట్టినప్పుడు వరి మడి అంతా సమానంగా పారాలి. అదే విధంగా చేనులో ఎక్కువ నీరు ఉన్నప్పుడు వాటిని తీసేసే మార్గం అంటే మురుగు నీరు పోయే సౌకర్యం ఉండాలి. భూసారం పెంచడం కోసం సేంద్రియ పదార్థం వాడడం వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెంది మొక్కకు కావాల్సిన పోషక పదార్థాలు అందుబాటులోకి తెస్తాయి.

భూసారాన్ని పెంచే కొన్ని సేంద్రియ పద్ధతులు

చెరువుమట్టి వేయడం :

ప్రతి మూడు సంవత్సరాలకోసారి ఎకరానికి 15-20 బండ్లు చెరువు మట్టిని తోలాలి. దీని వల్ల నేలకు తేమను పట్టిఉంచే శక్తి పెరిగి పంట దిగుబడులు పెరుగుతాయి.

పెంటపోగు ఎరువు :

వరి సాగుకు పూర్తిగా కుళ్ళిన పెంటపోగు ఎరువు/ పశువుల పెండ తప్పనిసరిగా వేయాలి. ఎకరానికి కనీసం 15 బండ్లు లేదా 3 ట్రాక్టర్ల (6 టన్నులు) పశువుల ఎరువు సరిపోతుంది. ఎరువు బాగా నాణ్యమైనదిగా ఉండాలి. ఈ క్రమంలో ఇటీవల వానపాముల (జెర్రలు) ఎరువు తయారీ, వినియోగం కూడా ఎక్కువవుతోంది.


పచ్చిరొట్టపైరు :


పచ్చిరొట్ట పైరు భూమి సారాన్ని పెంచడానికి ఎంతగానో సహాయ పడుతుంది. పచ్చిరొట్ట పైరు సగం పూత దశలో ఉండగా దున్ని, నేలలో కలిపి మురగ పెడతారు. సాధారణంగా జీలుగ, జనుము వంటి పంటలను పచ్చిరొట్ట



పైరుగా సాగు చేస్తారు. పచ్చిరొట్ట పైరు పెరగడానికి 45 రోజులు, అది మురగడానికి పది రోజులు పడుతుంది. పచ్చిరొట్ట పైరును దున్ని, నేలలో కలిపిన రోజు నారు మడి పోసుకుంటే పచ్చిరొట్ట పైరు కుళ్ళిపోయే సమయానికి నారుమడి నాటుకు తయార వుతుంది. పచ్చిరొట్ట పైరు సాగు చేయడానికి, మురగ బెట్టడానికి తగినంత నీటి వసతి, సమయం ఉండేట్లు చూసుకోవాలి. ఈ పద్ధతి చౌడు భూముల్లో వరి పండించి నప్పుడు మంచి ఫలితాన్నిస్తుంది.

పచ్చిఆకు ఎరువులు :





పచ్చిరొట్ట పంట వేసుకోవటం కుదరని పరిస్థితుల్లో దూరంగా ఉన్న చెట్ల ఆకులను, లేత కొమ్మలను తీసుకు వచ్చి పొలంలో కలుపుకోవచ్చు. ఇది పచ్చి ఆకుల ద్వారా నేలకు ఎరువులు అందించే పద్ధతి. పచ్చిఆకు ఎరువుగా ఉపయోగపడే మొక్కలు **గ్లైరిసీడియా, కానుగ, మోతుక, సీతాఫలం, వెంపలి.** దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గట్ల మీద ఈ మొక్కలను నాటుకుంటే ప్రతీ పంట సీజన్‌లో ఎరువు అవసరాలు సులువుగా అందించవచ్చు.

వేప చెక్క, గానుగ చెక్క

ఎరువువేసి, దున్ని, చదును చేయడంతో ఇక పొలం విత్తడానికి లేక నాట్లకు సంసిద్ధమవుతుంది. ఇందులో చివరి పనిగా నాట్లకు కొద్దిగా ముందు, దుక్కి ఎరువు, జీవన ఎరువులను కొద్దిగా ఉపయోగించవచ్చు. దిబ్బ ఎరువు, పచ్చిరొట్ట ఎరువుల మాదిరి కాకుండా వీటిని మొక్కలు తక్షణం తీసుకుంటాయి. నూనెగింజల నుంచి నూనె తీసేశాక మిగిలే గానుగ చెక్కలో సేంద్రియ నత్రజని సమృద్ధిగా ఉంటుంది. గానుగ చెక్క ఒక ఎరువుగా చాలా వేగంగా పనిచేస్తుంది.

వరిసాగులో చాలా ఎక్కువగా రెండు రకాల గానుగ చెక్కలను ఉపయోగిస్తారు. ఒకటి వేప చెక్క, రెండవది వేరుశెనగ చెక్క. ఈ రెండు గానుగ చెక్కలు నేల ఉత్పాదక శక్తిని పెంచడమేగాక, చీడ పురుగులను దూరం ఉంచడానికి కూడా ఉపయోగపడుతాయి. నూనె గింజల నుంచి నూనె తీసేశాక మిగిలే గానుగ చెక్క వరి పెరుగుదల ప్రారంభ దశలో అత్యవసరమైన పోషకాల్ని అందిస్తుంది. పునాది ఎరువుగా ఉపయోగిస్తున్నట్లయితే ఎకరాకు 60 కిలోల వేప చెక్క లేదా 40 కిలోల వేరుశెనగ చెక్క సరిపోతాయి. పై పాటు ఎరువుగానయితే, రెండింటిలో ఏదైనా ఒకటి.... ఎకరానికి 25 కిలోలు సరిపోతుంది. ఎరువులు వేయాల్సిన పంట దశలలో ఈ గానుగ చెక్కను పొలంలో చల్లాలి. గానుగ చెక్కలోని పోషకాలు మొక్కలు ఉపయోగించుకోవడానికి తగిన రూపంలో సిద్ధంగా ఉంటాయి. మొక్కలు వాటిని వెంటనే తీసుకుంటాయి.

జీవన ఎరువులు

సేంద్రియ ఎరువులు వాడడం వల్ల తయారయ్యే సేంద్రియ పదార్థం భూమిలో సూక్ష్మ జీవుల అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. ఈ సూక్ష్మ జీవులు నిరంతరం సేంద్రియ పదార్థాన్ని విడగొట్టి, అందులోని పోషకాన్ని మొక్కలు తీసుకోడానికి వీలుగా మార్చి అందిస్తుంటాయి. సేంద్రియ పదార్థంలో బందీ అయి ఉండే పోషకాలు, విడుదలై మొక్కలకు అందాలంటే ఈ సూక్ష్మజీవులు తప్పనిసరిగా అవసరం.

నేలలో సూక్ష్మజీవుల సంఖ్యను కృత్రిమంగా అభివృద్ధి చేయాలంటే అజోస్పైరిల్లమ్, ఫాస్ఫో బ్యాక్టీరియా, నీలి ఆకుపచ్చ నాచువంటి సూక్ష్మజీవులను నేలలో చేర్చాల్సి ఉంటుంది. ఈ ఎరువులు అంగళ్ళలో దొరుకుతాయి. వీటిని తగిన మోతాదులలో పొలానికి చేర్చడం వల్ల నేలలో ఆయా సూక్ష్మ జీవుల సంఖ్యను పెంచగలుగుతాం.

అజోస్పైరిల్లమ్

అజోస్పైరిల్లమ్ అనేది నేలలో, మొక్కల వేర్ల దగ్గర, వేర్ల మీద ఉండే సాధారణ బ్యాక్టీరియం. ఇది వాతావరణంలోని నత్రజనిని మొక్కకు అనువుగా స్థిరీకరిస్తుంది. నేలలో చేర్చిన తరువాత ఇది లక్షలు లక్షలుగా వృద్ధి చెందుతుంది. ఒక హెక్టారుకు ఒక పంట కాలానికి 20-40 కిలోల నత్రజనిని అందించగలుగుతుంది. అజోస్పైరిల్లమ్ మొక్కల పెరుగుదలకు అవసరమైన మరికొన్ని పదార్థాల్ని కూడా తయారు చేసి అందిస్తుంది.

ఫాస్ఫోబ్యాక్టీరియా

ఫాస్ఫోబ్యాక్టిరియా నీటిలో కరగని భాస్వరాన్ని కరిగే రూపాలకు మార్చి మొక్కలు తీసుకోవడానికి వీలుగా చేసి ఇస్తుంది. మొక్కల పెరుగుదలకు, బాగా పూత రావడానికి, చివరికి పంట దిగుబడి పెరగడానికి ఈ జీవ ఎరువులు బాగా ఉపయోగపడతాయి.

అజోస్పైరిల్లమ్‌ను పంటపై పిచికారీ చేయవచ్చు.

అజోస్పైరిల్లమ్ అనేది తృణధాన్యాలు, గడ్డిమొక్కల వేర్ల చుట్టూ అభివృద్ధి చెందే ఒక రకం బ్యాక్టీరియా. ఇది వాతావరణంలోని నత్రజనిని తీసుకుని మొక్కలు ఉపయోగించుకోవడానికి వీలైన రూపానికి మార్చి అందిస్తుంది. 23 కిలోల అజోస్పైరిల్లమ్‌ను, 2 కిలోల ఫాస్ఫోబ్యాక్టీరియాను, 25 కిలోల దిబ్బ ఎరువు లేదా కంపోస్టు లేదా తడి ఇసుకతో కలిపి పొలంలో చల్లాలి. ఆ రెండింటిని దిబ్బ ఎరువుతో కలపడం వల్ల వాటిని పొలం అంతటా సమానంగా చల్లడానికి వీలవుతుంది.

జీవామృతం

జీవామృతం తయారీకి అవసరమైన ముడి సరుకులు:

ఆవు పేడ .... 10 కిలోలు

ఆవు మూత్రం .... 10 లీటర్లు

నల్ల బెల్లం .... 2 కిలోలు

శనగ పిండి................................ 2 కిలోలు

ప్లాస్టిక్ డ్రమ్ము ....200 లీటర్లది

తయారు చేసే విధానం: పెద్దపాత్రలో 200 లీటర్ల నీరు తీసుకోవాలి. దానికి 10 కిలోల పేడ కలపాలి. కట్టెతో దాన్ని బాగా కలియబెట్టాలి. దానికి మెత్తగా పొడి చేసిన బెల్లం (2 కిలోలు), శనగపిండి (2 కిలోలు) కలపాలి. దానికి 10 లీటర్ల పశువుల మూత్రాన్ని పిడికెడు మట్టిని కలిపి బాగా కలియబెట్టాలి. పాత్రపై గోనెసంచి కప్పిఉంచి, వారం రోజులు పులియబెట్టాలి. రెండు మూడు రోజులకొకసారి కట్టెతో కలియబెడుతుండాలి.

జీవామృతాన్ని తయారుచేసిన 2-3 రోజుల్లో కూడా వాడుకోవచ్చు. వారంలో జీవామృతంలో సూక్ష్మజీవులు పూర్తిస్థాయికి వృద్ధి చెంది ఉంటాయి. దీనిని సన్నని ధారగా పొలానికి వెళ్ళే నీటితో కలిసేట్టు చూడాలి. దీనిని వడగట్టి స్ప్రింక్లర్ లేదా డ్రిప్‌లో కూడా నీటికి కలుపవచ్చు.

మోతాదు: ఎకరాకు 200 లీటర్ల జీవామృతాన్ని సాగు నీరు ద్వారా అందించవచ్చు. లేదా సాగు భూమి పైన జల్లవచ్చు.

అమృతజలం

అమృతజలం అనేది ఆవుపేడ, ఆవు మూత్రంతో చేసే ఒక సేంద్రియ ఉత్పత్తి. పొలంలో సూక్ష్మజీవుల సంఖ్యను అభివృద్ధి చేయడానికి దీన్ని ఉపయోగిస్తారు. దాణా కాకుండా గడ్డిని ఆహారంగా తీసుకునే గేదెల పేడ, మూత్రమునైనా అమృతజలం తయారీకి వాడుకోవచ్చు.

అమృతజలం తయారీకి ఒక లీటరు ఆవు మూత్రం, ఒక కిలో తాజా ఆవుపేడ, 100 గ్రాముల బెల్లం, 10 లీటర్ల నీరు అవసరం.

తయారీ పద్ధతి: పెద్దపాత్రలో లేదా సిమెంట్ తొట్టిలో నీరుపోయాలి. అందులో తాజా ఆవుపేడ వేసి బాగా కలియబెట్టాలి. తరువాత 100 గ్రాముల బెల్లం కలిపి బాగా కలపాలి. చివరికి ఆవు మూత్రాన్ని అందులో కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక రాత్రంతా అలాగే ఉంచి మర్నాడు ఉపయోగించాలి. చివర్న ఉపయోగించే ముందు దానికి 10 రెట్ల నీరు కలిపి సజల ద్రావణంగా మార్చాలి. ఇలాంటి ద్రావణం ఒక ఎకరా పంట పొలానికి 500 లీటర్లు అవసరమవుతుంది. ఈ సజల ద్రావణాన్ని సాగు నీటి పారుదలలో కలిపి ఉపయోగించవచ్చు. లేదా నేరుగా మొక్కలపై పిచికారీ చేయవచ్చు. అమృత జలం నేల ఉత్పాదక శక్తిని, దిగుబడిని పెంచుతుంది. బీడుపడిన నేలలను పునర్జీవింపచేయడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది.

రైజోబియం కల్చర్ వాడకం

ఎం.దీపిక, ఎ.టి.ఎం., మేడ్చల్, రంగారెడ్డి జిల్లా

కంది, పెసర, మినుము, శనగ వంటి పప్పుధాన్యపు పైర్లకు, వేరుశనగ, సోయాబీన్ వంటి నూనెగింజల పైర్లకు, బఠానీ, చిక్కుడు వంటి కూరగాయ పైర్లకు, ఉలవ, పిల్లి పెసర, బర్సీమ్ వంటి పశుగ్రాస పైర్లకు రైజోబియం కల్చరును వుపయోగించవచ్చు. ఇవి ఎకరాకు 20 కిలోల పై బడి నత్రజనిని స్థిరీకరించగలవు. వీటిని వుపయోగించినప్పుడు పైర్ల దిగుబడి 25-30 శాతం పెరుగుతుంది. 16 నుండి 32 కిలోల నత్రజని భూమిలో నిల్వ వుండి తర్వాత పైర్లకు వుపయోగపడుతుంది. దీని వాడకం వల్ల వేర్లు బాగా వృద్ధి చెందుతాయి. వేర్లపై బుడిపెలు ఏర్పడతాయి. వీటిలోని రైజోబియం సూక్ష్మజీవులు గాలిలోని నత్రజనిని స్థిరీకరించి మొక్కకు అందిస్తాయి. వేర్వేరు పైర్లకు వేర్వేరు రైజోబియం కల్చర్లను వాడాలి.

వాడే విధానం: ఒక లీటరు నీటిలో 50 గ్రాములు బెల్లం లేదా పంచదార కరిగించి 15 నిమిషాలు మరగకాచి చల్లార్చాలి. ఈ ద్రావణానికి 200 గ్రాముల రైజోబియం కల్చర్‌ను వేసి బాగా కలిపి జావగా తయారు చేసి, విత్తనానికి పట్టించాలి. విత్తనం పైపొరకు నష్టం కలగకుండా చూడాలి. విత్తనాన్ని ఆరబెట్టి, వెంటనే విత్తాలి. రైజోబియం కల్చర్ 200 గ్రాముల ప్యాకెట్లలో లభిస్తుంది. ఇది ఒక ఎకరంలో వేయాల్సిన విత్తనానికి పట్టించడానికి సరిపోతుంది. నేలలో తగినంత సమర్థవంతంగా వుంటుంది.

పనస కాయ మరియు పళ్ళతో వివిధ తినుబండారాల తయారీపై శిక్షణ



డిసెంబర్ నుండి సెప్టెంబర్ వరకు కనిపించే కాయల్లో పనస కాయ ఒకటి. ఇది ఎక్కువగా ఎక్కువ వర్షపాతం మరియు తేమ గల ప్రాంతాలలో కనిపిస్తుంది. తెలుగు రాష్ట్రాలలో ముఖ్యంగా కోస్తా మరియు ఎక్కువ వర్షపాతం గల పర్వత ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తుంది. ఉత్తర కోస్తా జిల్లాలైన విశాఖపట్నం, విజయనగరం మరియు శ్రీకాకుళం జిల్లాల్లో ఇవి విరివిగా కనిపిస్తాయి.

పనస చెట్టులో ప్రతీ భాగం విలువైనదే. అందుకే పెద్దలు దీన్ని మహా వృక్షాల సరసన చేర్చారు. దీని కలప ఫర్నీచర్‌కి పనికి వస్తుంది. ఆకులతో విస్తరాకులు చేస్తారు. పింజలతో కూర చేస్తారు. పలుకుబారిన కాయతో చిప్స్ మరియు కొన్ని ఇతర వంటకాలు చేస్తారు. పళ్ళు తినడానికి మరియు జాం, జెల్లీవంటివి తయారు చేయడానికి వుపయోగిస్తారు. పనస పిక్కలతో కూడా కూర వండుకుంటారు. ఇలా పనసలో ప్రతీ భాగంతో ఏదో ఒక తినుబండారాన్ని తయారు చెయ్యొచ్చు.

ఆరోగ్య రీత్యా కూడా పనస తినడం మంచిది ఎందుకంటే ఇది తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ వున్న పండు. అలాగే ఇందులో వున్న పోషక తత్త్వాలు, తిన్నవారికి, రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఇది కాన్సర్ నిరోధకంగా పనిచేస్తుంది. జీర్ణ శక్తిని పెంపొందిస్తుంది. కళ్ళకు మంచిది. మరియు చర్మ కాంతిని పెంపొందిస్తుంది. రక్తహీనతను అరికడుతుంది, ఎముకల ధృడత్వాన్ని పెంచి, ఎముకల సంబంధమైన రుగ్మతలు రాకుండా కాపాడుతుంది.


ఇది కూరగా లేదా పండుగా తినడం తప్ప ఎలాంటి విలువపెంపొందించే వస్తువులను (వేల్యూ ఎడిషన్) తయారు చేయడం రెండు రాష్ట్రాలలోను మనకు కనిపించదు. కానీ దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, కర్నాటక, తమిళనాడు మరియు మహారాష్ట్ర, గోవా వంటి రాష్ట్రాలలో పనసతో అనేక రకాల తినుబండారాలను చేసి విలువ పెంపొందిస్తున్నారు. కేరళలో చిప్స్, జామ్, జెల్లీ, ఊరగాయ, పచ్చి పనస నే ముక్కలు చేసి అమ్మడం వంటివి ఎన్నో కనిపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే



100 గ్రా. పనస పండు కి పోషక విలువలు

క్ర.సం.	పోషకతత్త్వం	సరాసరి విలువ
1.	తేమ (%)	76.20
2.	శక్తి (కేలరీస్)	88.00
3.	మాంసకృత్తులు (గ్రా.)	1.90
4.	క్రొవ్వు (గ్రా.)	0.10
5.	పీచు పదార్థం (గ్రా.)	1.10
6.	పిండి పదార్థం (గ్రా.)	19.80
7.	పొటాషియం (మీ.గ్రా.)	107. 00
8.	కాల్షియమ్ (మీ.గ్రా.)	20.00
9.	భాస్వరం (మీ. గ్రా.)	41.00
10.	ఇనుము (మీ.గ్రా.)	0.56
11.	బీటా కెరోటిన్ (మీ.గ్రా.)	175.00
12.	థయామిన్ (మీ.గ్రా.)	0.03
13.	రిబోఫ్లావిన్ (మీ.గ్రా.)	0.13
14.	నియాసిన్ (మీ.గ్రా.)	0.40
15.	విటమిన్-సి (మీ.గ్రా.)	7.00

మామిడి, సపోటా తోటల్లాగా పనస తోటలు కూడా ఆరంభమయ్యేయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా పనసపళ్ళు చెట్లు గల ఉత్తర కోస్తాలో విశాఖపట్నం జిల్లా ఒకటి. సుస్థిర వ్యవసాయ కేంద్రం (సి.ఎస్.ఎ.), విశాఖపట్నం వారు స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం (భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ కృషి విజ్ఞాన కేంద్రం, హరిపురం), మరియు స్థానిక స్వచ్ఛంద సంస్థలైన వికాస (విశాఖపట్నం), ఎస్.ఆర్.డి.ఒ (శ్రామిక రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్) చెట్టుపల్లి, నర్సీపట్నం మండలం మరియు ఆంధ్ర ప్రదేశ్ ఉద్యానవన శాఖలతో కలిసి పనస కాయ మరియు పళ్ళతో వివిధ తినిబండారాల తయారీ పై శిక్షణను జూన్ 14-16 వరకు కృషి విజ్ఞాన కేంద్రంలో జరిపారు. దీనికి శిక్షకులుగా కేరళ నుంచి శ్రీమతి పద్మిని శివదాస్ గారు మరియు శివదాస్గార్లు వచ్చారు. వీరు కేరళ లో పనస పై అనేక శిక్షణలు ఇచ్చారు. ఈ ప్రాంతం లో




ఇటువంటి శిక్షణ ఇవ్వడం ఇది ప్రప్రథమం. ఇందులో22 మంది గిరిజన యువతీ యువకులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ప్రతీ రోజు పనస తో కొన్ని వంటకాలను తయారు చేయడం రిసోర్స్ పర్సన్స్ చూపిస్తూ శిక్షణ కు వచ్చిన వారితో కూడా చేయిపించారు. మూడురోజుల్లో సుమారు 20 వంటకాలను తయారు చేయడం పై శిక్షణ ఇచ్చారు.సుస్థిర






వ్యవసాయ కేంద్రం తరపున స్థానిక గిరి కోపరేటివ్ నుండి 12 మంది పాల్గొన్నారు.

శిక్షణ ముగింపు సమావేశంలో శిక్షణార్ధులు మాట్లాడుతూ, మొదట ఇన్ని పనస కాయలు పండ్లు తీసుకువస్తుంటే భోజనంకి బదులు పనస కాయలే పెడతారా అన్న అనుమానం వచ్చింది. ఇన్ని పనస కాయలతో ఏం చేస్తారు అనుకున్నాం? కానీ మూడు రోజుల ట్రైనింగ్ తర్వాత అర్రే మనం ఎంత వేస్ట్ చేస్తున్నాం అనిపించిందన్నారు. ఒక శిక్షణార్ధి, రాజు మాట్లాడుతూ తనుతన ఊరికి దగ్గరలోనే వున్న టూరిస్ట్ స్పాట్ దగ్గర తినుబండారాలు అమ్ముతుంటాను. ఇప్పుడు పనస వంటకాలు కూడా స్పెషల్‌గా అమ్ముతాను అని తెలిపారు. ఇంకోశిక్షణార్ధి నారాయణ మాట్లాడుతూ కొన్ని నెలల కిందట తన చేలో వున్న 6 పనస చెట్లను అడ్డుగా






వున్నాయని నరికేసాను. ఇప్పుడుతెలుస్తోంది ఎంత తప్పు చేసానో అని. ఇది తమకు చాల అక్కరకొచ్చే శిక్షణ అని వారందరూతెలిపారు.

గిరి కోపరేటివ్ నుండి వచ్చిన కుసభ్యులు తమలో ఒక నలుగురైదుగురు కలిసి ప్రొడక్ట్స్ తయారు చేసి సహజ ఆహారం కు ఇవ్వగలమని తెలిపారు.

ఈ శిక్షణ తో తూర్పు ప్రాంతం లో పనస వేల్యూ చైన్ మీద పనిచేయడానికి అంకురం పడుతుందని ఆశిస్తున్నాం. మామిడి కి దీటుగా నిల్చునే సామర్థ్యం ఉన్న చెట్టు పనస. భవిష్యత్ లో ఆహార రీత్యా వ్యాపార రీత్యా మంచి ఆస్కారమున్న చెట్టు గ ఆదివాసీలకు ఆదాయ వనరుగా రూపొందే అవకాశమున్న చెట్టు పనస.



అజొల్లా పెంపకం

వి. భారతి, వ్యవసాయ అధికారి, రైతు శిక్షణా కేంద్రం, చిత్తూరు జిల్లా

అజొల్లా ఫెర్న్ జాతికి చెందినది. బావుల్లో, నీటి కొలనుల్లో, కాలువల్లో, నీటితో నిండిన వరిచేలలో ఇది సహజంగా పెరుగుతుంది. అజొల్లా నీలి, హరిత అల్గేతో సహ జీవనం చేస్తుంది. వీటి సమూహం వల్ల వరి చేలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. హెక్టారుకు 15-20 కిలోల నత్రజని అందుతుంది. మరియు నేలకు బయోమాస్ సమకూరుతుంది. అజొల్లా బాగా పెరగడానికి ఉష్ణోగ్రత, నీరు అందుబాటులో వుండడం, నియంత్రిత ఇరిగేషన్, భాస్వరం అందుబాటులో వుండడం ప్రధానంగా అవసరం.

పాడి పశువులకు, జలచరాలకు, పౌల్ట్రీ పక్షులకు కావాల్సిన పోషకాలన్నీ అజొల్లా అందించగలదు. వీటి నుండి అత్యధిక స్థాయిలో బయోమాస్ ఉత్పత్తి అవుతుంది. కనుక పాడిపశువుల మేతకు ఫీడ్ అవసరాలు తీర్చడానికి కూడా ఇది చక్కటి ప్రత్యామ్నాయం.

రైతులు ఇళ్ళల్లో, చిన్న పెరటి నేలల్లో అజొల్లాను తేలికగా, చౌకగా పెంచి వాడుకోవచ్చు. అందువల్ల ఇది చిన్న, సన్నకారు రైతులకు, భూమిలేని పేదలకు చక్కటి ఆదాయ వనరు కాగలదు. కావున వ్యవసాయానికి, వ్యవసాయేతర ఆదాయానికి ఇది తోడ్పడుతుంది. ఈ నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతులకు అజొల్లా ఉత్పాదనలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారు మంచి ఆదాయాన్ని పొందగలరు.

అజొల్లా యొక్క ప్రయోజనాలు:

- ఇది నేలలోని సేంద్రియ కర్బనం, సేంద్రియ పదార్థాలను ద్విగుణీకృతం చేస్తుంది.
- వరి పంటకు ఎకరాకు 15 నుండి 30 కిలోల నత్రజనిని అందిస్తుంది.
- వరిలో పెరుగుదల ఉత్పాదకతను పెంపొందిస్తుంది. కావాల్సిన పోషకాలు, అమైనో ఆమ్లాలు, విటమిన్-ఎ, విటమిన్ - బి వంటి వాటిని అందిస్తుంది.
- పాడి పశువులకు, చేపలకి సమృద్ధమైన ఫీడ్ మెటీరియల్‌గా పని చేస్తుంది. వృద్ధి అవుతాయి.

అజొల్లా పెంచే విధానం:

- అజొల్లా పెంపకానికి ఎంపిక చేసుకున్న ప్రదేశంలో కలుపు లేకుండా శుభ్రం చేయాలి.
- 10 మీ. ఎత్తైన నిర్మాణం (2.2.5 × 1.5 మీ) కొలతలతో గుంతను నిర్మించాలి. ఇటుకల ఉపయోగించి శాశ్వత కట్టడాన్ని కూడా తయారు చేసుకోవచ్చు.
- గుంతలో లోపలి భాగంలో ప్లాస్టిక్ షీట్‌లతో అన్ని వైపులా కప్పి మొక్కల వేళ్ళు లోనికి చొచ్చుకుని పోకుండా అదుపులు ఏర్పాటు చేయాలి.
- 2.7 × 1.8 మీ. సైజు సిల్‌పాలిన్ షీట్ ఏర్పాటు చేసి, ఆ షీటు అంచులు గుంతపైకి వచ్చేటట్లుగా అన్ని వైపులా మేకులతో గట్టిగా అమర్చాలి.
- 30-35 కిలోల, 5.5-7.5 పి.హెచ్. గల సారవంతమైన మట్టిని హెచ్చుతగ్గులు లేకుండా గులకరాళ్ళు, పెద్దలు లేకుండా గుంతలో నింపాలి.
- పేడస్లర్రీని తయారు చేసుకొని 4-5 కిలోల పశువుల పేడను 15-20 లీటర్ల నీటిలో కలిపి స్లర్రీని హెచ్చుతగ్గులు లేకుండా మట్టిపై, నేలపై చల్లాలి.
- గుర్తింపు పొందిన ఏజెన్సీ నుంచి సేకరించిన అజొల్లా మాతృక కల్చరును 1-1.5 కిలోల చొప్పున నిల్చి వున్న నీటిలో పలుచగా పరచాలి.
- నిర్మాణం పై గుంతలపై నైలాన్ నెట్ కట్టి, పెద్దలు, ఆకులు పడకుండా జాగ్రత్త చేయాలి.
- 7-10 రోజులలో అజొల్లా ప్రవర్ధనం చెందుతూ మొత్తం గుంత అంతా నిండుతుంది. 1 కిలో మాతృ కల్చరు నుండి 8 నుండి 10 కిలోల అజొల్లా

తయారవుతుంది. 7వ రోజు నుండి అజొల్లా బయోమాస్‌ను సేకరించి వుపయోగించుకోవచ్చు.

అజొల్లా ఉత్పాదన - నిర్వహణ సంరక్షణ :

- అజొల్లా పెంపకానికి ఉద్దేశించిన ప్రదేశానికి ప్రత్యక్షంగా సూర్యరశ్మి సోకకూడదు. అలాగే పూర్తిగా నీడకూడా ఉండకూడదు.
- 30 సెం.మీ. కన్నా తక్కువ ఉష్ణోగ్రత లభ్యమయ్యే చోట అజొల్లా ఎక్కువగా పెరుగుతుంది. అందువల్ల వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి.
- అజొల్లా పెంచే ప్రదేశం పరిశుభ్రంగా ఉంచాలి.
- గుంత అంతా కనీసం 5 సెం.మీ. ఎత్తు నీరు నిలిచి వుండాలి.
- 10 రోజులకు ఒకసారి మొక్కల్లో పావువంతు నీటిని గుంత నుండి తొలగించి తిరిగి పరిశుభ్రమైన నీటితో వుంచాలి.
- అలాగే ప్రతి 2 నెలలకు కనీసం 5 కిలోల మట్టిని గుంత అన్ని వైపుల నుంచి తొలగించి శుభ్రమైన మట్టితో నింపి హెచ్చుతగ్గులు లేకుండా పరవాలి.
- 7వ లేదా 8వ రోజు నుంచి ఎప్పటికప్పుడు అజొల్లా బయోమాస్‌ను నిరంతరాయంగా సేకరిస్తూ గుంతలో అధికంగా పెరుగుదలను నియంత్రించాలి.

వరిలో అజొల్లా ప్రాధాన్యత:

వరి చేలలో సేంద్రియ పదార్థాల లోటు వుంటుంది. అందువల్ల నేలలో సారం తక్కువగా వుంటుంది. ఆర్గానిక్ కార్బన్ తగినంత నేలలో పెంపొందడానికి, నత్రజని సరఫరా సరిపడినంత జరగడానికి సేంద్రియ ఎరువులు చాలా అవసరం. అయితే సేంద్రియ ఎరువుల లభ్యత చాలా తక్కువగా వుంది. అయితే రసాయన ఎరువులు చాలా ఖర్చుతో కూడుకున్నది. అందువల్ల అజొల్లాను చౌకగా పెంచడమే కాక నత్రజనిని అతి తక్కువ సమయంలో నేలలో స్థిరీకరించవచ్చు. ఆ రకంగా రైతు ఆదాయానికి తగిన విధంగా పర్యావరణానికి సురక్షితంగా సేంద్రియ పదార్థం మరియు నత్రజనిని వరి చేలలో అందించడం నేలసారాన్ని నిర్వహించడంలో అజొల్లా ఎంతో ప్రధానమైనది.

వరి నాటడానికి ముందు:

ఎకరాకు 10 కిలోల చొప్పున అజొల్లాకు 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్‌తో కలిపి పిచికారీ చేనులో 5 సెం.మీ. ఎత్తులో నీరు నిలిచేటట్లు ఏర్పాటు చేసి చల్లాలి. 3 వారాల్లో అజొల్లా ప్రవర్ధనం చెందుతుంది. ఒక ఎకరా నేల నుండి 3 టన్నుల నత్రజని సరఫరా అవుతుంది.

నాటిన తర్వాత:

చేనులో వరినాట్లు వేసిన 7 నుంచి 10 రోజుల తర్వాత ఎకరాకు 5 కిలోల చొప్పున చేనంతా చల్లాలి. 2 నుంచి 3 వారాల్లో అజొల్లా కల్చర్ ప్రవర్ధనం చెంది దట్టమైన చాపవలె పరుచుకుంటుంది. ఆ తర్వాత చేల్లో కలుపు తొలగిస్తూనే అజొల్లాను కూడా తొలగించి చేనులో పూర్తిగా కుళ్ళిపోయేలా వదిలేయాలి. చివికి పోయిన అజొల్లా బయోమాస్ అత్యంత విలువైన ఆర్గానిక్ పదార్థాలను, పోషకాలను నేలకు అందిస్తుంది.

రైతులకు లాభసాటికాని మద్దతు ధరలు - కొన్ని వాస్తవాలు

కె. రవి

బీజేపి పార్టీ 2014 ఎన్నికల ముందు ఎన్ని హామీలు ఇచ్చినప్పటికీ, పంటలకు కనీస మద్దతు ధరలను ప్రకటించడంలో గత ప్రభుత్వాల దారిలోనే పయనిస్తున్నది. పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులకు, ప్రకటిస్తున్న ధరలకు ఏ మాత్రం పొంతన ఉండడం లేదు. పైగా ఉత్పత్తి ఖర్చుల లెక్కింపులోనూ అనేక అవకతవకలున్నాయి. 2012-13, 2013-14 ఖర్చుల ఆధారంగా (ఉత్పాదకాలు, కూలిరేట్లతో సహా) 2016-17 సంవత్సరానికి ధరలను నిర్ణయించే పద్ధతే అత్యంత అశాస్త్రీయమైనది. పైగా పంటల దిగుబడులు విషయంలోనూ, ఉత్పత్తి ఖర్చుల విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వాల అంచనాలకు, సి.ఎ.సి.పి. అంచనాలకు మధ్య విపరీతమైన అంతరం వుంటోంది. రాష్ట్ర ప్రభుత్వాల అంచనాలు కూడా దిగుబడుల విషయంలో ఎక్కువగా వుంటున్నాయి. ఉదాహరణకు పత్తి విషయమే చూస్తే హెక్టారుకు 20 క్వింటాళ్ళ దిగుబడి అంచనా వేశారు. అంటే ఎకరానికి 8 క్వింటాళ్ళన్న మాట. కానీ గత కొన్ని సంవత్సరాలుగా క్షేత్ర స్థాయి పరిశీలనలతో కానీ, ఆర్థిక, గణాంకశాఖ, సి.ఎ.సి.పి, పత్తి సలహా మండలి అంచనాల ప్రకారంగానీ పత్తి సంగటు దిగుబడి ఎకరానికి 6 క్వింటాళ్ళకు దాటడం లేదు. కరువు వచ్చిన సంవత్సరాలలో, వర్షాధార ప్రాంతాల రైతులు 2, 3 క్వింటాళ్ళ మించి పొందలేక పోతున్నారు. ఇలా లేని దిగుబడులను చూపించడం వల్ల క్వింటాలు సగటు ఉత్పత్తి ఖర్చు తగ్గి, మద్దతు ధరలు కూడా తగ్గించి ప్రకటించే అవకాశం వుంటుంది. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు, సన్న, చిన్నకారు రైతులను మరింత సంక్షోభంలోకి నెట్టేవే తప్ప, ఒడ్డున పడేసేవి కావు. మద్దతు ధరలకు సంబంధించి, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రానికి ఉత్తరాలు రాసి చేతులు దులుపుకోకుండా, తాము సిఫారసు చేసిన ధరలను ఆయా రాష్ట్రాలలోని రైతులకు అందించేందుకు పూనుకోవాలి. పంటల ధరల విషయంలో సి.ఎ.సి.పి. రిపోర్టు నుండి కొన్ని గణాంకాలు చూడండి. ఉత్పత్తి ఖర్చులన్నీ తీసేశాక, రైతుకు ఒక హెక్టారుపై మిగిలే నికర మిగులును చూస్తే వ్యవసాయ కుటుంబాలు ఎందుకు సంక్షోభంలో వున్నాయో ఇట్టే అర్థమైపోతుంది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు 2016-17 ఖరీఫ్ కోసం కేంద్రాన్ని కోరిన కనీస మద్దతు ధరలు (క్వింటాలుకు/ రూపాయలు)

క్ర.సం.	పంట	ఆంధ్రప్రదేశ్ కోరినది	తెలంగాణా కోరినది
1.	వరి సాధారణ	2,762	3,118
2.	వరి గ్రేడ్ – ఏ	3,392	3,986
3.	జొన్న	2,714	3,740
4.	సజ్జ	2,333	3,206
5.	మొక్కజొన్న	2,400	2,824
6.	రాగి	2,816	3,308
7.	కంది	8,583	10,261
8.	పెసర	7,945	8,878
9	మినుము	7,448	7,595
10.	వేరుశనగ	7,319	7,186
11.	నువ్వులు	10,056	10,198
12.	సోయాబీన్	4,358	4,735
13.	పొద్దుతిరుగుడు	7,167	8,911
14.	గడ్డి నువ్వులు	–	–
15.	పత్తి (మధ్యస్థ)	7,438	7,725
16.	పత్తి (పొడుగు)	7,593	8,092

ఆధారం: సి.ఎ.సి.పి 2016-17 ఖరీఫ్ రిపోర్ట్

సి.ఎ.సి.పి. సూచనల ప్రకారం 2016-17 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధరలు

(క్వింటాలుకు రూపాయలలో)

క్ర.సం.	పంటలు	పంట ఉత్పత్తి ఖర్చులు (అంచనా) 2016-17		2014-15 మద్ధతు ధరలు	2015-16 మద్ధతు ధరలు	2016-17 మద్ధతు ధరలు
		ఎ2 +ఎఫ్.ఎల్	సి2			
1.	వరి సాధారణ	1045	1378	1360	1410	1470
2.	వరి (గ్రేడ్ - ఏ)	-	-	1400	1450	1510
3.	జొన్న హైబ్రిడ్	1501	1992	1530	1570	1625
4.	జొన్న మల్దండి	-	-	1550	1590	1650
5.	సజ్జ	925	1218	1250	1275	1330
6.	మొక్కజొన్న	966	1286	1310	1325	1365
7.	రాగి	1733	2150	1550	1650	1725
8.	కంది	3241	4314	4350	4625 (200/-బోనస్‌తో)	5050 (425/- బోనస్‌తో)
9.	పెసర	4065	5191	4600	4850 (బోనస్‌తో)	5225 (425/- బోనస్‌తో)
10.	మినుము	3584	4661	4350	4625 (బోనస్‌తో)	5000 (425/- బోనస్‌తో)
11.	వేరుశనగ	3371	4300	4000	4030	4220 (100/- బోనస్‌తో)
12.	సోయాబీన్ (నలుపు / తెలుపు	1852	2542	2560	2600	2775 (100/- బోనస్‌తో)
13.	పొద్దుతిరుగుడు	3479	4418	3750	3800	3950 (100/- బోనస్‌తో)
14.	గడ్డి నువ్వులు	3366	4320	3600	3650	3825 (బోనస్‌తో)
15.	నువ్వులు	4188	5570	4600	4700	5,000 (200/- బోనస్‌తో)
16.	పత్తి (మధ్యస్త గింజ)	-	-	3750	3800	3860
17.	పత్తి (పొడుగు పింజ)	2889	3920	4050	4100	4160

ఈ ధరలు 1-10-2016 నుండీ అమలులోకి వస్తాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో వివిధ పంటలకు ఉత్పత్తి ఖర్చులు, ఆదాయం, స్థూల మిగులు, నికర మిగులు (2013-14 ప్రకారం)

క్ర.సం.	పంట	ఖర్చు ఎ2 (హెక్టారుకు)	ఖర్చు ఎ2+ఎఫ్ఎల్	ఖర్చు సి2	పంట దిగుబడి విలువ(హెక్టారుకు)	ఎ2 పై మొత్తం మిగులు	ఎ2+ఎఫ్ఎల్పై మొత్తం మిగులు	నికర మిగులు (హెక్టారుకు)
1.	వరి	36219	42466	66088	75060	38841	32594	8972
2.	మొక్కజొన్న	29710	34418	53543	60637	30928	26220	7094
3.	జొన్న	17238	22698	33517	35697	18459	12999	2179
4.	రాగి	16220	32108	42970	35139	18918	3031	-7831
5.	కంది	18830	24153	35809	33504	14674	9350	-2305
6.	పెసర	10485	13235	22756	29080	18595	15845	6324
7.	మినుము	17300	18942	32368	43722	26422	24780	11354
8.	వేరుశనగ	39527	46926	73152	79070	39543	32144	5918
9.	సోయాబీన్	-	-	-	-	-	-	-
10.	పొద్దుతిరుగుడు	18363	25292	35113	31188	12825	5896	-3925
11.	నువ్వులు	10431	14077	21179	20722	10291	6645	-457
12.	గడ్డి నువ్వులు	-	-	-	-	-	-	-
13.	పత్తి	42343	48858	71912	70525	28182	21667	-1387

2016-17లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో పంటల వారీ ఉత్పత్తి ఖర్చు (క్వింటాలుకు రూపాయలలో) (సి.ఎ.సి.పి.ప్రకారం)

క్ర.సం.	పంటలు	భారతదేశ సగటు సి2	రాష్ట్ర ఎ2	ఎ2+ఎఫ్ఎల్	రాష్ట్ర	దేశ ఉత్పత్తిలో వాటా
1.	వరి	1,378	862	1,002	1,402	11
2.	జొన్న	1,992	958	1,309	1,815	9
3.	సజ్జ	1,218	-	-	-	-
4.	మొక్కజొన్న	1,286	669	768	1,159	25
5.	రాగి	2,150	1,065	2,216	2,775	3
6.	కంది	4,314	2,522	3,267	4,584	8
7.	పెసర	5,191	2,221	2,894	4,484	18
8.	మినుము	4,661	1,992	2,180	3,419	20
9.	వేరుశనగ	4,300	2,407	2,869	4,219	19
10.	సోయాబీన్	2,542	-	-	-	-
11.	పొద్దు తిరుగుడు	4,418	2,334	3,263	4,308	23
12.	నువ్వులు	5,570	4,374	5,779	7,963	5
13.	గడ్డి నువ్వులు	4,320	-	-	-	-
14.	పత్తి	3,920	2,350	2,693	3,912	20

2016-17లో తెలుగు రాష్ట్రాలు, సి.ఎ.సి.పి మధ్య దిగుబడులు మరియు ఉత్పత్తి ఖర్చుల అంచనాలో తేడాలు

(కింటాళ్ళు / హెక్టారుకు / క్వింటాలుకు / రూపాయలు)

క్ర.సం	పంట	ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం		తెలంగాణా రాష్ట్రం		ఈ రాష్ట్రాలకు సి.ఎ.సి.పి అంచనా	
		దిగుబడి	ఉత్పత్తి ఖర్చు	దిగుబడి	ఉత్పత్తి ఖర్చు	దిగుబడి	ఉత్పత్తి ఖర్చు
1.	వరి	60	1,841	50	2,079	56	1,402
2.	జొన్న	16	1,810	11	2,493	21	1,815
3.	సజ్జ	17	1,555	12	2,137	-	-
4.	మొక్కజొన్న	49	1,600	34	1,883	47	1,159
5.	రాగి	12	1,877	12	2,205	15	2,775
6.	కంది	6	5,722	5	6,841	8	4,584
7.	పెసర	6	5,296	5	5,918	6	4,484
8.	మినుము	7	4,965	6	5,064	6	4,484
9.	వేరుశనగ	10	4,879	12	4,791	18	4,218
10.	సోయాబీన్	19	2,905	15	3,157	-	-
11.	పొద్దు తిరుగుడు	8	4,778	6	5,941	9	4,308
12.	నువ్వులు	5	6,704	3	6,799	3	7,963
13.	పత్తి (మధ్యస్థ)	20	4,959	20	5,150	19	3,912

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సి.ఎ.సి.పి వేసిన ఉత్పత్తి ఖర్చు అంచనాలను తెలంగాణాకు ప్రాతిపదికగా చేసుకున్నారు.

సి.ఎ.సి.పి ప్రకారం వివిధ పంటలకు 2016-17 సంవత్సరానికి అంచనా ఉత్పత్తి ఖర్చులు (క్వింటాలుకు రూపాయలు)

క్ర.సం.	పంట	ఉత్పత్తి ఖర్చులు		
		ఎ2	ఎ2 + ఎఫ్ఎల్	సి2
1.	వరి	791	1,045	1,378
2.	జొన్న	1,171	1,501	1,992
3.	సజ్జ	549	925	1,218
4.	మొక్కజొన్న	709	966	1,286
5.	రాగి	1,211	1,733	2,150
6.	కంది	2,405	3,241	4,314
7.	పెసర	2,821	4,065	5,191
8.	మినుము	2,624	3,584	4,661
9.	వేరుశనగ	2,695	3,371	4,300
10.	సోయాబీన్	1,543	1,852	2,542
11.	పొద్దు తిరుగుడు	2,912	2,479	4,418
12.	నువ్వులు	2,705	4,188	5,570
13.	గడ్డి నువ్వులు	1,629	3,366	4,320
14.	పత్తి	2,305	2,889	3,920

'సుస్థిర సేద్యంతోనే సురక్షిత ఆహారం' ప్రచార కార్యక్రమంలో మనం నగరాలలో ఏం చేయగలం..


- ❖ కార్యాలయాల్లో, స్కూల్స్‌లో, కళాశాలల్లో మీటింగులు ఏర్పాటు చేయవచ్చు. వివిధ చోట్ల పోస్టర్లు, స్టిక్కర్లు అంటించవచ్చు. వీడియోలు ప్రదర్శించవచ్చు.
- ❖ గ్రామాలకు వెళ్ళి రైతులలో సేంద్రియ వ్యవసాయ అవసరాన్ని గురించి విస్తృత ప్రచారం చేయవచ్చు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులను అభినందించవచ్చు. నగరంలో సేంద్రియ ఉత్పత్తులతో మేళాలు నిర్వహించవచ్చు.
- ❖ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు అవసరమైన మద్దతు అందించాలని ప్రభుత్వం పై ఒత్తిడి చేయవచ్చు.
- ❖ 'ఇంటి పంట'ను పండించుకోవచ్చు. దీని వల్ల ఆరోగ్యకరమైన కూరగాయలు, పండ్లు అందుతాయి. వ్యవసాయంలో

[illegible]

ట్రైకోకార్డుల వాడకం

జి. రజిత, డా॥ ఎ. వీరయ్య, శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు, కడప జిల్లా

మార్కెట్‌లో 10 సెం.మీ. పొడవు, 5 సెం.మీ. వెడల్పు గల పసుపు రంగులో కార్డులలో వేలాది సంఖ్యలో చిన్న చిన్న నల్ల గుడ్లను బంక వేసి అతికించి వుండేలా లభించును. వాటినే ట్రైకోకార్డు అంటారు. 1 సి.సి. ట్రైకోకార్డులో సుమారు 20000 ట్రైకోగ్రామా పారాసిట్రైడ్ గుడ్లు వుంటాయి. ధర 50 రూపాయలు మాత్రమే. కార్డుల్లో 3-4 రోజుల వయస్సు గల ట్రైకోగ్రామా లార్వాలను కార్సిరా గుడ్లలో అమర్చి వుంచుతారు. వీటి జీవిత కాలం 7-10 రోజులు, కనుక ట్రైకోకార్డులు కొన్నాక వీలున్నంత త్వరగా పొలంలో విడుదల చేయాలి. లేకుంటే 10 డిగ్రీల సెంటీగ్రేడ్ వద్ద రిఫ్రిజిరేటరులో 10 రోజుల పాటు నిల్వ చేసుకొని, పొలంలో విడుదల చేయవచ్చు.



విడుదల చేసే సమయం:

పొలంలో గుడ్లు అధిక సంఖ్యలో గమనించినా లేక లింగాకర్షక బుట్టలు ఎకరానికి 4 చొప్పున అమర్చి వరుసగా మూడు రోజుల పాటు రెక్కల పురుగులు గమనించినచో ట్రైకోకార్డు విడుదల చేయాలి. ఉదయం (లేక) సాయంత్రం వేళలో ట్రైకొకార్డులు చిన్న చిన్న ముక్కలు చేసి కప్పులా సూర్యరశ్మి పడకుండా వుండేలా విడుదల చేయాలి. ముందు, వారం తరువాత పురుగు మందును పిచికారీ చేయరాదు.

మోతాదు:

- ❖ పంటను బట్టి, పురుగును బట్టి ట్రైకోగ్రామా రకంను ఎంచుకోవాలి.
- ❖ వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు నాటిన 30 రోజులకు 20,000 ట్రైకోగ్రామా .....
- ❖ వరిలో ఆకుముడత పురుగు నివారణకు నాటిన 75 రోజులకు 40,000 ట్రైకొగ్రామా కిలొనిస్ గుడ్లను,
- ❖ పత్తిలో కాయ తొలుచు పురుగుల నివారణకు విత్తిన 45 రోజులకు 60,000 ట్రైకోగ్రామా కిలొవిగ్ (3 సి.సి) ఎకరానికి 6 దఫాల్లో వారం వ్యవధిలో విడుదల చేయాలి. చెరకులో కాండం తొలుచు పురుగుల నివారణకు నాటిన 45-90 రోజులు ట్రైకోగ్రామా కిలొనిస్ 60 రోజులకు ట్రైకొగ్రామా జపానికం ఎకరానికి 2000 గుడ్లను 4-6 దఫాలుగా 10 రోజుల వ్యవధిలో విడుదల చేయాలి.

పొలంలో చీడ పురుగుల యొక్క గుడ్లు ఆకారాన్ని బట్టి ట్రైకోగ్రామా ఆశిస్తుంది. చీడ పురుగుల గుడ్లలో ట్రైకోగ్రామ తమ గుడ్డును పెట్టి, లోపలున్న పదార్థాలను తింటు లార్వా ప్యూపా దశలు గడిపి రెక్కల పురుగు గుడ్డును చీల్చుకొని బయటకు వస్తుంది. ఇలా చీడపురుగులు గుడ్డు దశలొనే ఆగిపోయి, లార్వాగా వృద్ధి చెందకుండా, పంటకు నష్టం చేయకుండా పురుగుల నివారణ చేస్తుంది.

ట్రైకోగ్రామా పరాన్న బుక్కు:

వీటి జీవిత కాలం 7-10 రోజులు మాత్రమే. కనుక వాటి సంతతికి పెంచుకుని, పంటను కాపాడటానికి 6 దఫాలల్లో ట్రైకోకార్డులు విడుదల చేయాలి. దీని వలన పురుగు మందు ఖర్చు తగ్గి, వాతావరణాన్ని సంరక్షిస్తూ, పంటను కాపాడుకోవచ్చు. అందువల్ల రైతులు ట్రైకోకార్డులను వాడాలని కోరుకుంటున్నాము.

సుప్రీం కోర్టు ఆదేశాలు బేఖాతర్
కరువు కోరల్లో జనం విలవిల - జల్ హల్ యాత్రకు వినిపించిన 'గోడు'

పి. శంకర్, దళిత బహుజన ఫ్రంట్

కరువు కటకాలతో అల్లాడుతున్న ప్రజలను ఆదుకొని కరువు సహాయాన్ని హక్కుగా అందించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల అమలును పరిశీలించేందుకు దేశ వ్యాప్తంగా పౌర సంఘాలు, సంస్థలు జల్‌హల్ యాత్రను చేపట్టాయి. కరువు నివారణ చర్యలు అవసరమైన మేరకు చేపట్టడం లేదని సుప్రీం కోర్టులో కేసు వేసిన స్వరాజ్ అభియాన్ తోపాటు ఏక్త పరిషత్, జల్‌బిరాదారి, జాతీయ ప్రజా ఉద్యమాల వేదికల ఆధ్వర్యంలో మే 21 నుండి 31 వరకు లాతూర్ నుండి బుందేల్ ఖండ్ వరకు పాదయాత్ర చేశారు. ఈ యాత్రలో భాగంగా జూన్ 2 నుండి 3 రోజులపాటు తెలంగాణా రాష్ట్రంలో మరో 20 స్థానిక సంస్థలు నీళ్ళు - నాగలి పేరుతో యాత్ర 3 జిల్లాలు, 8 మండలాలు, 9 గ్రామాల్లో నిర్వహించారు. కరువు నివారణ చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, కనీసం త్రాగడానికి మంచినీరు అందించడం లేదని పలు గ్రామాల ప్రజలు తమ గోడును యాత్రా బృందానికి వినిపించారు. నీళ్ళు, గడ్డిలేక, పశువులు చనిపోయాయని, సగం ధరకే అమ్ముకోవాల్సి వచ్చిందని వివరించారు. పంటలు ఎండిపోయి తిండి, పని లేక వలసలు వెళ్ళుతున్నామని చెప్పారు.

తెలంగాణా రాష్ట్రం ఆవిర్భావ దినోత్సవం నాడు జిల్లా కేంద్రం మహబూబ్‌నగర్‌లోని రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి యాత్రను ఏక్తా పరిషత్ పి.వి. రాజగోపాల్, వాటర్‌మేన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్, యాక్షన్ ఎయిడ్ సందీదివ్, చెన్నయ్య యాత్రను ప్రారంభించారు. పట్టణంలో 3 కిలోమీటర్ల పాటు ర్యాలీ మార్కెట్ యార్డు వరకు సాగింది. కరువు నివారణ కోసం సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని, కరువు సహాయాన్ని హక్కుగా అందించాలని, పశువులకు గడ్డిని పంపిణీ చేయాలని, పంట నష్ట పరిహారం చెల్లించాలని, త్రాగునీరు సరఫరా చేయాలని తదితర నినాదాలతో ఆట, పాట, డ్యాన్స్‌లు, డబ్బు చప్పుళ్ళతో ప్రజలకు భరోసా కల్పిస్తూ యాత్ర సాగింది.

మహబూబ్‌నగర్ నుండి హన్వాడ మండలం టంకర గ్రామానికి యాత్ర సాగుతూ దళిత వాడకు చేరుకోగానే అప్పుడే ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా జరిగినా నీళ్ళు సరిపోక ఖాళీ బిందెలతో మహిళలు, పిల్లలు హడావుడితో కనిపించారు. వారిని పలకరించగా మా వాడకు 4, 5 రోజులకోసారి ట్యాంకర్ వస్తుందని, నీరు సరిపోవడం లేదని, మాపట్ల వివక్ష చూపుతున్నారని దళిత మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామచావిడి వద్ద జరిగిన సమావేశంలో సర్పంచ్ భర్త, ఉపసర్పంచ్, పలువురు పెద్దలు, మహిళలు మాట్లాడుతూ 500 ఫీట్ల లోతు వరకు బోర్లు వేసినా, నీళ్ళు పడటం లేదని, గత 5 సంవత్సరాల నుండి వర్షాలు సరిగ్గా పడటం లేదన్నారు. కరువు సహాయం, పంట నష్టపరిహారం చెల్లించలేదన్నారు. కరువు పని చేసి 3 నెలలు గడుస్తున్నా కూలీ డబ్బులు చెల్లించడం లేదని, మేం ఎట్లా బతకాలని ప్రశ్నించారు. గడ్డి, నీళ్ళు లేక 750 పశువులను సగం ధరకే అమ్ముకున్నామన్నారు. టంకర నుండి కొత్తపేటకు చేరుకోని అక్కడ గ్రామ పంచాయితీ ముందు రాత్రి జరిగిన సమావేశంలో సర్పంచ్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, మహిళలు పలువురు మాట్లాడుతూ వారానికి ఒక్కసారి 5 బిందెల నీళ్ళు ట్యాంకర్ ద్వారా అందిస్తున్నారని, అవి దేనికీ సరిపోవడం లేదన్నారు. ఉపాధిహామి పనికి వెళ్ళితే రోజుకు 60 -70 రూపాయలు పడుతున్నవి. అవి కూడా ఇవ్వక 3 - 4 నెలలు అవుతున్నది. పని లేక దాదాపు 150 మంది మగవాళ్ళు బొంబాయి, పూనె, హైదరాబాద్, గుంటూరులకు వలస వెళ్ళుతున్నారన్నారు.

రెండవ రోజు నవాబ్‌పేట మండలం కూచూర్ గ్రామానికి చేరుకోగా 5 వేల కుటుంబాలు వున్న గ్రామంలో

వారానికి ఒక్క సారి నీళ్ళు వస్తున్నాయన్నారు. కొంత మంది అసైన్డ్, భూదానం భూములను బినామీ పేర్లతో అనుభవిస్తున్నారని, పని చేసిన కూలీ డబ్బులు ఇవ్వడం లేదని, 300 మంది వలసెళ్ళారని, 40 పశువులను అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు.

కూచూర్ నుండి నల్గొండ జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రంలో అధికారులను కలువగా కరువు నిధులే రాలేదన్నారు. అదే మండలంలోని చౌదరిపల్లి గ్రామానికి వెళ్ళగా గత 5 సంవత్సరాల నుండి ఒక రైతుకు నెలకు 5 వేలు చెల్లిస్తూ వ్యవసాయ బోర్ నుండి నీళ్ళు కొనుగోలు చేస్తూ గ్రామాన్ని 4 సెక్టార్‌లుగా విభజించుకొని 4 రోజులకొకసారి నీరును సరఫరా చేసుకుంటున్నామన్నారు. గ్రామంలో పనులు లేక భువనగిరి, హైదరాబాద్, కీసరలకు పనులకు వెళ్ళు తున్నామని వివరించారు. చౌదరిపల్లి నుండి కండ్లకుంట తండా వరకు పాద యాత్రగా వెళ్ళగా 8 రోజులకు ఒకసారి నీటిని కొనుక్కొంటున్నామని అవి త్రాగడానికే సరిపోవడం లేదని గిరిజన మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. తండా నుండి తుర్కపల్లి మండలం మల్కాపురం గ్రామ పంచాయితి వద్ద రాత్రి సభ జరిగింది. గ్రామంలో వెయ్యి బోర్లు వున్నా 10 శాతం కూడా పని చేయడం లేదని, 5 రోజులకు ఒకసారి నీరు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని సర్పంచ్ వివరించారు. 50 పశువులు చనిపోయాయని, వున్న పశు వులను సగం ధరకే అమ్ముకున్నామని రైతులు చెప్పారు.

మల్లన్న సాగర్ నిర్వాసితుల పోరాటానికి బాసట...

చివరి రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని జగదేవపూర్‌లో పత్రిక విలేఖరుల సమావేశం పెట్టి కరువుపై ప్రభుత్వ వైఫల్యాలను వివరించడం జరిగింది. కరువు నివారణలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాం. అక్కడి నుండి కొండపాక మండలం ఎర్రవల్లి, దీక్ష వద్దకు చేరుకోగా తెలంగాణా వస్తే బాగుపడుతామంటే కొట్లాడాము కానీ కేసిఆర్‌కు ఓట్లు వేస్తే మా వూరినే మల్లన్న సాగర్‌లో ముంచుతున్నాడని దేవమ్మ అనే మహిళ ఆందోళన వ్యక్తం చేసింది. మా భూములు, మా వూరు పోతే మేం ఎక్కడ ఎట్లా బ్రతకాలే అని సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, ఉపసర్పంచ్ శివకుమార్, నాయకులు క్రిష్టారెడ్డి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రవల్లి నుండి తోగుట మండలం వెములఘాట్ గ్రామానికి చేరుకోగా అక్కడకూడ మల్లన్నసాగర్ ప్రాజెక్టు వ్యతిరేకంగా దీక్షలు నడుస్తూన్నాయి. మా గ్రామంలో 5 వేల ఎకరాల సాగు భూమి వుందని రెండు పంటలు పండే భూమిని ప్రాజెక్టుకు తీసుకుంటే మా భవిష్యత్ ఏమిటని స్థానిక నాయకులు జనార్థన్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ప్రశ్నించారు. అక్కడి నుండి ఏటిగడ్డ కిష్టాపూర్‌కు వెళ్ళగా అక్కడ సైతం దీక్షలు నడుస్తున్నాయి. గత ఆరు నెలలుగా "మా భూములు, మా గ్రామం మాకే కావాలని కొట్లాడుతున్నామని" పోరాటానికి నాయకత్వం వహిస్తున్న ప్రశాంత్, చంద్రశేఖర్ రెడ్డి, సరోజమ్మ తదితరులు తెలిపారు. మా భూములను బలవంతంగా సేకరించవద్దంటే ఇప్పటికే ఒకసారి లాఠీఛార్జీ చేశారని, వృద్ధులు, మహిళలు తిండి మానేసి ఆందోళనకు గురవుతున్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం కాకుండా 123 జీ.వో. క్రింద ఖాళీ పార్మెట్లతో దొంగచాటుగా సంతకాలు పెట్టించుకుంటున్నారని దీనిని ప్రతిఘటిస్తున్నామని మా భూముల్లో 3 పంటలు పండుతాయని, వర్షం పడితే పక్కనే వున్న కూడెల్లి వాగు నిండుతాదని వివరించారు. అక్కడి నుండి యాత్ర హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి చేరుకుని సభతో ముగిసింది. సభలో ప్రొఫెసర్ కోదండరామ్, జీవన్ కుమార్, రుక్మిణీరావులతో పాటు మహిళా రైతు బాలమణి, యాత్రలో పాల్గొన్న వి.వి. రాజగోపాల్, సందీప్, రామకృష్ణరాజు, చార్లెస్ వెస్లి, శంకర్ తదితరులు యాత్రలో గుర్తించిన అంశాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించినప్పటికీ నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలం చెందిందని ప్రతి గ్రామంలో నెలకొన్న పరిస్థితులను చూస్తే అర్థమైంది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, కూలీలకు పని కల్పించడంలో కానీ, చేసిన పనికి వేతనాలు అందించలేక పోవడం, త్రాగునీరు సరఫరా చేయలేక చేతులెత్తేసింది. పశువుల గడ్డిని సరఫరా చేయలేకపోయింది. పంట నష్టపరిహారం పంటలకు బీమా, కరువు సహాయం అందించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందింది. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించింది.

బాక్టీరియా (సూక్ష్మజీవుల) ద్వారా సోకే వ్యాధులు

గొంతువాపు వ్యాధి (హెచ్.ఎస్)

వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధుల్లో "గొంతు వాపు" ప్రధానమైనది. దీనినే గురకవ్యాధి, కంఠమాద అని కూడా పిలుస్తారు. జూన్ నుంచి సెప్టెంబర్ మాసాల్లో తొలకరిలో ఇది ఎక్కువగా సోకుతుంది. గాలి కుంటు వ్యాధి ప్రబలిన గ్రామాల్లో గొంతు వాపు కూడా ఎక్కువగా సోకుతున్నట్లు గమనించారు. దీనికి ముఖ్యకారణం, ఆ గ్రామాల్లో పశువుల్లో వ్యాధి ప్రబలడం వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోవడమే.

గొంతువాపు సోకిన పశువు శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. కంటి నుంచి నీరు, నోటి నుంచి చొంగ పడుతుంది. గొంతు, మెడ వాస్తాయి. శ్వాస కష్టమై, గురక శబ్దంతో 24 గంటల్లో పశువు మరణిస్తుంది. వ్యాధి నిర్ధారణ ఖచ్చితంగా, వీలైనంత త్వరగా చేయాలి. సాధారణంగా రక్త పరీక్షల ద్వారా వ్యాధి కారక బైపోలార్ బాక్టీరియా గుర్తించి వ్యాధి నిర్ధారిస్తున్నారు. కానీ పశువు శరీర ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు సేకరించిన రక్తంలోనే బాక్టీరియా కనిపిస్తుంది. దీన్ని వేరు వేసి, గుర్తించడం తేలికైనపనేమికాదు. మూలగతో సహా పశువు ఎముకను ఐస్‌లో ఉంచి పరీక్షకు పంపితే 3 రోజుల్లో వ్యాధి నిర్ధారణ సాధ్యమవుతుంది.

చికిత్స: వ్యాధి తీవ్రతను బట్టి పశు వైద్యుల సలహాతో వాడాలి.

నివారణ: ప్రతి ఏడాది గొంతు వాపు సోకే ప్రాంతాల్లో తొలకరిలోనే ముందు జాగ్రత్తగా పశువులన్నింటికీ టీకాలు వేయిస్తే 7-10 రోజుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొంది 6-12 మాసాల పాటు వ్యాధి రాకుండా ఉంటుంది. గ్రామాల్లో పశువులు మరణిస్తున్న సందర్భాల్లో టీకాలు వేయకూడదు. తప్పనిసరి వేయించాల్సినస్తే ఆరోగ్యమైన పశువులకు టీకాలు వేసి, బూస్టర్ డోస్ తప్పక చేయాలి.

గొంతు వాపు త్వరగా వ్యాపించే అంటువ్యాధి. ఈ వ్యాధి సోకిన పశువుల్ని విడిగా ఉంచాలి. మరణించిన పశు కళేబరాన్ని అవి తినగా మిగిల్చిన గడ్డిని నీటి ప్రవాహాల్లో, బీళ్ళల్లో పడేయకుండా లోతైన గొయ్యితీసి పాతిపెట్టాలి.

చలి గాలులు, అధిక వర్షాలు, చాలా దూరం ప్రయాణించినప్పుడు పశువులు శారీరక, మానసిక ఒత్తిళ్ళకులోనై, వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. తద్వారా త్వరగా వ్యాధి బారిన పడతాయి. అందువల్ల సక్రమ యాజమాన్య పద్ధతులను ఆచరిస్తూ పోషకాలతో కూడిన పశుగ్రాసాన్ని అందించాలి.

పశువులు కోరబోవడం అంటే...

గ్రామీణ ప్రాంతాల్లో నాటువైద్యులు, రైతులు తప్పని పరిస్థితుల్లో కొన్ని చెట్ల పసర్లు, దినుసులు, కారం మొదలగు వాటిని నీళ్ళలో కలిపి వ్యాధి బారిన పశువులకు గొట్టంతో / సీసాతో త్రాగిస్తారు. బలవంతంగా లేదా కంగారుగా ఇలా త్రాగివ్వడం వల్ల మందు కడుపులోనికి వెళ్ళేబదులు ఊపిరి తిత్తులలోనికి వెళ్ళి పశువులు ఊపిరి ఆడక వెంటనే చనిపోతాయి. కాబట్టి ముఖ్యంగా పొట్ట ఉబ్బరం సందర్భాల్లో, గొంతు వాపు లాంటి వ్యాధులు సోకిన సందర్భాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ మందులను త్రాగించే ప్రయత్నం చేయకూడదు. అవసరమైతే బెల్లంతో కలిపి ఉండచేసి తినిపించాలి. సాధ్యమైనంత వరకు ఇలాంటి పరిస్థితుల్లో ఇంజక్షన్ రూపంలో మందుల్ని వాడాలి.

జబ్బ వ్యాపు వ్యాధి (బి.క్యూ)

ఈ వ్యాధిని సొప్ప వ్యాధి అని కూడా వ్యవహరిస్తారు. క్లాస్ట్రిడియం చౌవై అనే బ్యాక్టీరియా ద్వారా పశువుల్లో సోకే అంటువ్యాధి ఆరు మాసాల యుక్త వయస్సులో ఉండి, ఆరోగ్యంగా, ధృడంగా వున్న పెయ్యలకు ఎక్కువగా సోకుతుంది. ఈ వ్యాధి వర్షాకాలంలో ఎక్కువగా సోకుతుంది. కలుషితమైన ఆహారం, నీరు, గాయాల ద్వారా వ్యాధి సోకుతుంది.

లక్షణాలు:

జ్వరం 106 నుంచి 108 ఫారన్ హీట్, ఆకలి లేమి, నీరసం, నెమరు వేయకపోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస కష్టంగా తీసుకోవడం మొదలగు లక్షణాలు ఉంటాయి. సూక్ష్మజీవులు భుజం, తొడ ప్రాంతాల్లోని కండరాలను ఆశించి, మాంసం కుళ్ళిపోయేలా చేస్తాయి. తద్వారా పశువులు వాపుతో కుంటుతుంటాయి. వెనుక కాలు కానీ, ముందుకాలు గానీ పైకి లేపి ఉంచి, కుంటడం చేస్తాయి. వాపు దగ్గర కరకరమని శబ్దం వస్తుంది. వాపు ప్రారంభంలో ఎర్రగా, నొప్పిగా ఉండి, రాను రాను నొప్పి లేకుండా ఉంటుంది. రక్తంలో విషపదార్థాల ప్రభావం వల్ల పశువులు 12-48 గంటల్లో మరణిస్తాయి.

నివారణ:

- తొలకరిలో జబ్బ వాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి.
- వ్యాధి గ్రస్త పశువుల్ని వేరు చేయాలి. పశుకళేబరాల్ని కాల్చి వేయాలి. లేదా గొయ్యిలో పాతి పెట్టాలి. వ్యాధి సోకిన ప్రాంతాల్లో వ్యాధి సోకకుండా ఉండేందుకు పశువుల్ని మేయనీయకూడదు.

గ్రామీణ ప్రజలతో వివిధ సమస్యలపై ...





జల్‌హల్ యాత్రలో మాట్లాడుతున్న వివిధ ప్రజాసంఘాల నాయకులు





కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ

సి.సి.ఎల్.ఎ కార్యాలయం ముందు రైతు స్వరాజ్య వేదిక నిరసన





కరువు పీడిత గ్రామాలలో వృద్ధులకు, ఒంటరి

మహిళలకు ఆహారాన్ని అందించిన

రైతు స్వరాజ్య వేదిక

R&D/HSE/995/2016-2018 July-2016 Published on 28-06-2016 Posted on 30-06-2016

PRINTED, PUBLISHED and OWNED BY M.LEELA PRASAD, PRINTED AT M/S NAVYA PRINTERS, RAJBHAVAN ROAD, SOMAJIGUDA, HYDERABAD, PUBLISHED AT 16-11-741/1/A/3, MOOSARAM BAGH, HYDERABAD-500 036. EDITOR : Dr. G.V. RAMANJANEYULU

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

పుస్తకం సంఖ్య	KLVA102M276
పుస్తకం పేరు	తొలకరి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	41
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	SK. sharmila
పేజీలు విడదీసినది	SK. sharmila
స్కాన్ చేసినది	HBS97
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good